



బాధ్యతలు స్వీకరిస్తున్న అమాస రాజశేఖర్ రెడ్డి, పక్కన చిత్తూరు ఎమ్మెల్యే జగన్మోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ సీనియర్ నాయకుడు చంద్రప్రకాష్ తదితరులు

అవినీతి రహిత పాలన అందిస్తా

రాష్ట్రస్థాయిలో చిత్తూరు డీసీసీబీని ప్రథమ స్థానంలో నిలుపుతా

పర్సన్ ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించిన అమాస రాజశేఖర్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) బలోపేతానికి కృషి చేస్తూనే.. అవినీతి రహిత పాలన అందిస్తామని పర్సన్ ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించిన అమాస రాజశేఖర్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం చిత్తూరులోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో పర్సన్ ఇన్‌చార్జిగా అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అమాస ప్రసంగించారు. గత అనుభవాలను బేరీజు వేసుకుంటూ రాష్ట్రస్థాయిలో చిత్తూరు డీసీసీబీని ప్రథమ స్థానంలో నిలుపుతానని చెప్పారు. ఎంపీ, ఎమ్మెల్సీ ఎమ్మెల్యేల సహకారంతో బ్యాంకు అభివృద్ధికి కృషి చేస్తామని, రైతులకు మెరుగైన సేవలు అందిస్తామని తెలిపారు. నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్ మాట్లాడుతూ.. తిరోగమనం పట్టిన బ్యాంకును గాడిలో పెట్టి పూర్వవైభవం తేవాలని సూచించారు. బ్యాంకు అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని చిత్తూరు ఎమ్మెల్యే జగన్మోహన్ హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు మాట్లాడుతూ.. ఐదేళ్ల వైసీపీ పాలనలో అప్పటి పాలకవర్గం కోట్లాది రూపాయిలను దోపిడీ చేసిందన్నారు. దీనిపై తాను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లగా, ప్రభుత్వం విచారణకు ఆదేశించిందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, పులివర్తి నాని, చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, ఏపీ గ్రీనరీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ సుగుణమ్మ, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, మాజీ ఎమ్మెల్యే సీకే బాబు, టీడీపీ నాయకులు సురేంద్రకుమార్, చంద్రప్రకాష్, చెరుకూరి వసంత్‌కుమార్, ఎన్‌పీ జయప్రకాష్, బాలాజీ నాయుడు (గుడిపాల మాజీ జడ్పీటీసీ), జేఎంసీ శివ, కోదండ యాదవ్, బీజేపీ నాయకులు నవీన్‌కుమార్ (తిరుపతి), కొత్తూరు బాబు, హరిబాబు చౌదరి, దొడ్డారెడ్డి సిద్దారెడ్డి (తిరుపతి), తిరుపతి డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘన స్వాగతం, అభినందనలు

తొలుత బ్యాంకు ప్రధాన కార్యాలయానికి విచ్చేసిన అమాసకు సీఈవో శంకర్‌బాబు, జీఎంలు మనోహర్ గౌడ్, లిల్లీకేథరిన్, ఏజీఎం సురేష్ బాబు, బ్యాంకు లీగల్ ఆఫీసర్ గంగిరెడ్డి తదితరులు ఘన స్వాగతం పలికారు. బ్యాంకు ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు రఘుబాబు, గంగిరెడ్డి, సభ్యులు గణేష్, సురేష్, ఉమ్మడి జిల్లా నుంచి విచ్చేసిన టీడీపీ సీనియర్ నాయకులు, సింగిల్ విండోల మాజీ అధ్యక్షులు అభినందనలు తెలిపారు. కాగా, డీసీసీబీలోని ఎన్టీఆర్ విగ్రహానికి నాయకులతో కలిసి అమాస గజమాల వేసి, నివాళి అర్పించారు. అమాసకు ఫోన్ ద్వారా మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్ రెడ్డి, పలమనేరు ఎమ్మెల్యే అమర్‌నాథ రెడ్డి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

నియోజకవర్గానికో పారిశ్రామిక పార్కు

- కుప్పంలో ఎన్టీఆర్ సుజల స్రవంతికి రూ.8.22 కోట్లు
- కేబినెట్ మీటింగులో ఆమోదం

చిత్తూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రతి నియోజకవర్గంలోనూ పారిశ్రామిక పార్కును ఏర్పాటు చేస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీ అమలవుతోంది. తాజాగా ఒక కుటుంబం- ఒక పారిశ్రామికవేత్త అనే నిర్ణయాత్మక విధానాన్ని సీఎం చంద్రబాబు తెరపైకి తెచ్చారు. ఇప్పుడు ఈ విధానంలో భాగంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికో ఎంఎస్ఎంఈ పారిశ్రామికపార్కును అభివృద్ధి చేయాలని పరిశ్రమలు- వాణిజ్యశాఖ చేసిన ప్రతిపాదనను బుధవారం కేబినెట్ ఆమోదించింది. ఈ లెక్కన జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ఏడు పార్కులు అభివృద్ధి కానున్నాయి. జీడీనెల్లూరు నియోజకవర్గంలో దీనికి సంబంధం లేకుండా చిత్తూరు- తచ్చూరు నేషనల్ హైవేను దృష్టిలో పెట్టుకుని రెండు వేల ఎకరాలను సేకరించాలని ఆ మధ్య పర్యటించిన ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇక 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం కుప్పం నియోజకవర్గంలో అమలు చేసిన ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాన్ని ఇప్పుడు పునరుద్ధరించనున్నారు. ఇక్కడి నాలుగు మండలాల్లోని ప్రజల కోసం క్లస్టర్ ఆధారిత విధానంలో 15 వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను ఏర్పాటుచేయనున్నారు. దీనికోసం రూ.8.22 కోట్లతో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ పంపిన ప్రతిపాదనను కేబినెట్ ఆమోదించింది. ఈ మొత్తాన్ని వన్‌టైమ్ సెటిల్మెంట్ కింద మంజూరు చేయనున్నారు. ఆయా ప్లాంట్లను మరమ్మతులు చేసి అక్టోబరు నుంచి సుజల పథకాన్ని ప్రారంభించే అవకాశాలున్నాయి. దీనివల్ల నాలుగు మండలాల్లోని 2.85 లక్షల మందికి పరిశుభ్రమైన తాగునీరు అందుబాటులోకి వస్తుంది.

కూటమి సంబరాలు

రాక్షస పాలన నుంచి రాష్ట్ర ప్రజలకు విముక్తి కల్గిన రోజన్న నేతలు



వీర ఖడ్గం చూపుతున్న ఎమ్మెల్యే జగన్మోహన్, హాజరైన నాయకులు సీఆర్ రాజన్, దొరబాబు, అముద, హేమలత తదితరులు

చిత్తూరు సిటీ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాక్షస పాలన నుంచి రాష్ట్ర ప్రజలకు విముక్తి కలిగిన రోజు 2024 జూన్ 4వ తేదీ అంటూ కూటమి నాయకులు సంబరాలు జరుపుకున్నారు. టీడీపీ అధిష్ఠానం నుంచి పిలుపు లేకపోవడంతో చాలాచోట్ల సంబరాలు నిర్వహించలేదు. చిత్తూరులోని గాంధీ విగ్రహం వద్ద రాత్రి 7.30 గంటలకు జరిగిన సంబరాల్లో ఎమ్మెల్యే జగన్మోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, మేయర్ అముద, బీజేపీ, జనసేన నేతలు పాల్గొన్నారు. ● బంగారుపాళ్యంలో జరిగిన సంబరాల్లో ఎమ్మెల్యే మురళీమోహన్, టీడీపీ నేతలు పాల్గొన్నారు.● జీడీనెల్లూరు, ఐరాల,నగరి,వెదురుకుప్పం, కార్వేటినగరం మండలాల్లోనూ సంబరాలు జరిగాయి.

ఐదు మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో ఐదు మండలాల్లో తేలిపాటి వర్షం కురిసింది. మండలాలవారీగా.. సదుంలో 12.4, సోమలలో 8.6, రొంపిచెర్లలో 4.6, చౌడేపల్లెలో 4, పులిచెర్లలో 3.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

9న జిల్లాకు వైఎస్ షర్మిల రాక

చిత్తూరు సిటీ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఈనెల తొమ్మిదో తేదీన చిత్తూరుకు రానున్నారని జిల్లా అధ్యక్షుడు పోటుగారి భాస్కర్ తెలిపారు. బుధవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. తొమ్మిదో తేదీన స్థానిక చిత్తూరు - బెంగళూరు బైపాస్ రోడ్డులోని బ్యాన్స్‌హోటల్‌లో పార్టీ నేతలు, కార్యకర్తలతో షర్మిల సమావేశం నిర్వహిస్తారని చెప్పారు. అనంతరం జిల్లా పర్యటన ప్రారంభమవుతుందని, పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కుప్పంలో హరియాణా గ్యాంగ్ హల్‌చల్



దుండగులు వదిలి వెళ్లిన వాహనం వద్ద పోలీసులు

- వాహనంతో ఎస్ఐను తొక్కించబోయారు ● కాల్పులు జరిపిన సీఐ ● సినీ ఫక్కీలో ఘటన
- దుండగుల కోసం కొనసాగుతున్న గాలింపు

కుప్పం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో మంగళవారం రాత్రి హరియాణాకు చెందిన గ్యాంగ్ హల్‌చల్ చేసింది. సినీ ఫక్కీలో జరిగిన ఈ ఘటనపై పోలీసుల నుంచి ఆలస్యంగా అందిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మన జిల్లాలో అనేక నేరాలతో సంబంధం ఉన్న హరియాణాకు చెందిన అంతర్జాతీయ దోపిడీ దొంగల ముఠా కుప్పం వైపు వస్తున్నట్లు జిల్లా కేంద్రంలోని ఇంటెలిజెన్స్ వర్గాల ద్వారా స్థానిక పోలీసులకు మంగళవారం రాత్రి సమాచారమందింది. వెంటనే కుప్పం రూరల్ సీఐ మల్లేశ్ యాదవ్, గుడుపల్లె ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బందితో కలిసి వెదకడానికి బయల్దేరారు. మార్గమధ్యంలోని వ్యవసాయ మార్కెట్టు యార్డు వద్దకొచ్చేసరికి కుప్పంవైపు వేగంగా వస్తున్న ఒక స్కార్పియో వాహనం వారికి ఎదురు వచ్చింది. తమకున్న సమాచారంతో ఆ వాహనంలోనే హరియాణా గ్యాంగ్ ఉందని నిర్ధారించుకున్న ఎస్ఐ శ్రీనివాసులు దాన్ని ఆపడానికి ప్రయత్నించారు. అందులోని దుండగులు ఏమాత్రం ఆగకుండా ఎస్ఐ మీదకే వాహనాన్ని తీసుకొచ్చి.. తొక్కించబోయారు. ప్రమాదాన్ని ఊహించిన కుప్పం రూరల్ సీఐ మల్లేశ్ యాదవ్ వెంటనే వాహనంలోని దుండగులపై ఓ రౌండ్ కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. అయినా అతను వాహనాన్ని ఆపకుండా.. వెనక్కు మళ్లించి తిరుపత్తూరు మార్గంలోకి తిప్పాడు. ఆ వాహనాన్ని పోలీసులు మరో వాహనంలో వెంబడించారు. అతివేగంగా వెళ్లిన దుండగులు ప్రయాణించే వాహనం, ఇండస్ట్రియల్ ఎస్టేట్ వద్ద ఒక గార్మెంట్ ఫ్యాక్టరీ సందులో మలుపు తిరిగి మాయమైంది. వెంటాడిన పోలీసులకు పరమసముద్రం చెరువు గట్టుమీద ఖాళీ వాహనం వాహనం కనిపించింది. అప్పటికే దుండుగులు వాహనాన్ని వదిలి పరారయ్యారు. వాహనంలో డ్రైవర్‌తోసహా సుమారు ఐదుగురు ఉన్నట్లు తెలుస్తోంది. డీఎస్పీ పార్థసారథి ఆధ్వర్యంలో కుప్పం రూరల్ సీఐ మల్లేశ్ యాదవ్, అర్బన్ సీఐ శంకరయ్యలతోపాటు కుప్పం పోలీసు డివిజన్ సిబ్బంది మొత్తం మంగళవారం రాత్రినుంచే దుండగులకోసం గాలింపు మొదలుపెట్టారు. దుండగులు విడిచిపెట్టిన వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. బుధవారం మధ్యాహ్నం జిల్లా కేంద్రం నుంచి రెండు స్నిఫర్ డాగ్స్‌ను తెప్పించి వాటి ద్వారా గాలింపు జరిపారు. ప్రస్తుతం గాలింపు కొనసాగుతోంది.

జిల్లాలోని అనేక నేరాలతో సంబంధం

హరియాణా గ్యాంగ్‌కు జిల్లాలో జరిగిన అనేక నేరాలతో సంబంధం ఉన్నట్లు పోలీసు వర్గాలు చెబుతున్నాయి. ఎర్రచందనం అక్రమ రవాణా, ఇళ్ల దోపిడీలు, పశువుల దొంగతనాలు వంటి తీవ్రమైన నేరాల్లో వీళ్లు నిందితులని సమాచారం. హరియాణా నుంచి వచ్చిన గ్యాంగ్ పొరుగునే ఉన్న కర్ణాటక రాష్ట్రంలో మకాం వేసి మన జిల్లాలో నేరాలకు పాల్పడుతుందని తెలిసింది.

త్వరలోనే పట్టుకుంటాం : డీఎస్పీ

ఈ సంఘటనపై డీఎస్పీ పార్థసారథిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. హరియాణాకు సంబంధించిన దోపిడీదారుల ముఠా కుప్పం వైపు వస్తున్నట్లు చిత్తూరు నుంచి తమకు మంగళవారం రాత్రి సమాచారమందిందని చెప్పారు. కుప్పం వ్యవసాయ మార్కెట్టు సమీపంలో వాహనాన్ని గుర్తించి అడ్డుకోబోయిన పోలీసులపై వారు వాహనాన్ని నడపడానికి ప్రయత్నించారన్నారు. ఈ క్రమంలో కుప్పం రూరల్ సీఐ వారిపై కాల్పులు జరిపారని, అయినా దుండగులు పరారయ్యారని తెలిపారు. ప్రస్తుతం గాలింపు చర్యలు చేపట్టామన్నారు. హరియాణా గ్యాంగ్‌ను త్వరలోనే పట్టుకుని, చట్టప్రకారం శిక్షిస్తామని డీఎస్పీ చెప్పారు.

గజదాడిలో రైతు దుర్మరణం

నాగమవాండ్లపల్లె భజనబండ సమీపంలో దుర్ఘటన







గణపతి మృతదేహం (ఇన్‌సెట్లో) ఫైల్ ఫొటో - మృతుడి కుటుంబానికి రూ.5 లక్షల చెక్ అందిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్, డీఎఫ్‌వో భరణి

ఐరాల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఏనుగు దాడిలో ఓ రైతు దుర్మరణం చెందాడు. ఐరాల మండల కేంద్రానికి కూతవేటు దూరంలోని నాగమవాండ్లపల్లె భజనబండ సమీపంలో ఈ దుర్ఘటన జరిగింది. బుధవారం వేకువజామున ఐదు ఏనుగుల గుంపు నాగమవాండ్లపల్లెలోని పొలాలపై దాడి చేశాయి. మామిడి, చెరకు, వరి పంటలతోపాటు రాతి కూసాలు, కంచెను ధ్వంసం చేశాయి. ఈ క్రమంలో గోవిందరెడ్డిపల్లెకు చెందిన ఓ రైతు మామిడి తోటపై పడ్డాయి. సమీపంలోనే రైతు సూరిమాని గణపతి(60), మునీశ్వరి దంపతులు తమ తోట వద్ద నిద్రిస్తున్నారు. ఏనుగుల ఘీంకారానికి వారు నిద్రలేచారు. భార్యను అక్కడున్న గదిలోనే ఉండమని చెప్పి ఏనుగులను తరమడానికి గణపతి ఒక్కడే వెళ్లాడు. ఓ ఏనుగు ఆయనపై దాడి చేయడంతో తల పగిలిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. ఏనుగుల అలజడి తగ్గాక గ్రామంలోని రైతులు పొలాల వద్దకు చేరుకున్నారు. అక్కడ గణపతి మృతదేహం కనిపించడంతో కుటుంబీకులకు, పోలీసులకు, అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పునరావృతం కాకుండా చర్యలు

ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. నాగమవాండ్లపల్లెలో గణపతి మృతదేహానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు.

రూ.10లక్షల పరిహారం

రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.10లక్షల పరిహారాన్ని ప్రకటించినట్లు గణపతి కుటుంబీకులకు ఎమ్మెల్యే మురళీమోహన్, డీఎఫ్‌వో భరణి తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం బాధితులకు రూ.5లక్షల చెక్కును అందించారు. టీడీపీ మండల అధ్యక్షుడు హరిబాబునాయుడు, మాజీ అధ్యక్షుడు గిరిధర్‌బాబు, నాయకులు మణినాయుడు, లత, రాజేష్‌రెడ్డి, రంజిత్ రెడ్డి, పురుషోత్తం, కోదండ యాదవ్ పాల్గొన్నారు.

వైసీపీ 'వెన్నుపోటు దినం' ర్యాలీలు

- జీడీనెల్లూరులో 'వైఎస్సార్ డౌన్ డౌన్' నినాదాలు
- నిబంధనల ఉల్లంఘనపై ఎమ్మెల్సీ భరత్‌సహా 35మందిపై కేసు



పుంగనూరులో నిర్వహించిన ర్యాలీలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తదితరులు

చిత్తూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదైనా ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని ఆరోపిస్తూ 'వెన్నుపోటు దినం' పేరుతో జిల్లా వ్యాప్తంగా వైసీపీ నాయకులు బుధవారం ర్యాలీలు నిర్వహించారు. జీడీనెల్లూరులో మాజీ మంత్రి నారాయణ స్వామి, నియోజకవర్గ ఇన్‌చార్జి కృపాలక్ష్మి ఆధ్వర్యంలో వైఎస్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం అక్కడి కార్యకర్తలు వైఎస్సార్ డౌన్‌డౌన్ అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. నారాయణస్వామి, కృపాలక్ష్మిలు అలా నినాదాలు చేయొద్దంటూ నిలువరించే ప్రయత్నం చేశారు. కుప్పంలో ఎమ్మెల్సీ భరత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో నిబంధనలు ఉల్లంఘించడం, పోలీసులతో దురుసుగా ప్రవర్తించడంపై ఎమ్మెల్సీ సహా 35మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలపై కేసు నమోదు చేసినట్లు కుప్పం అర్బన్ సీఐ శంకరయ్య తెలిపారు. ఇక చిత్తూరులో నియోజకవర్గ ఇన్‌చార్జి విజయానందరెడ్డి, పుంగనూరులో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి, బంగారుపాళ్యంలో మాజీ ఎమ్మెల్యేలు సునీల్‌కుమార్, లలితకుమారి, నగరిలో మాజీ మంత్రి రోజా, పలమనేరులో జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆధ్వర్యంలో ర్యాలీలు జరిగాయి.

నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం

చిత్తూరు సెంట్రల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లాలో పెద్ద ఎత్తున మొక్కలు నాటనున్నారు. ప్రధానంగా అటవీ ప్రాంతాల్లో, నగరవనాల్లో కలెక్టర్ సుమిత్‌కుమార్, డీఎఫ్‌వో భరణి, ప్రజాప్రతినిధులు ముఖ్యఅతిథులుగా పాల్గొని మొక్కలు నాటనున్నట్లు ఎఫ్ఆర్వో థామస్ సుకుమార్ తెలిపారు. గురువారం ఉదయం 9.30 గంటలకు పెనుమూరు క్రాస్ వద్దనున్న నీవా నగరవనంలో మొక్కలు నాటనున్నట్లు పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు కలెక్టర్ బహుమతులు ప్రదానం చేయనున్నారు. అనంతరం నగరంలోని పార్కులో కలెక్టర్ నిధులతో ఏర్పాటు చేసిన ఆటవస్తువులను కలెక్టర్ ప్రారంభించి, అక్కడ మరిన్ని మొక్కలు నాటనున్నారు.


జస్టిస్ హిరణ్మయ్ భట్టాచార్య


పీఎంఎస్ ప్రసాద్

శ్రీవారిసేవలో ప్రముఖులు


తిరుమల, జూన్4(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. కలకత్తా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హిరణ్మయ్ భట్టాచార్య వేకువజాము సుప్రభాత సేవలో శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో రిలయన్స్ సీఈవో పీఎంఎస్ ప్రసాద్, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

ఆర్టీసీ బస్ డ్రైవర్‌పై కానిస్టేబుల్ దాడి!



తిరుమల, జూన్4(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఎలక్ట్రికల్ డ్రైవర్‌పై ఓ కానిస్టేబుల్ దాడి చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వివరాలివి.. తిరుమలలోని మాధవనిలయం ముందు మంగళవారం రాత్రి 7.30 గంటలకు ప్రయాణికులను ఎక్కించుకునే క్రమంలో ఎలక్ట్రిక్ బస్సు డ్రైవర్ ఆపాడు. ట్రాఫిక్‌కి అంతరాయం కలిగిస్తున్నాడని వెనుకే ద్విచక్రవాహనంపై వస్తున్న కానిస్టేబుల్ ఆగ్రహంతో బస్సు ఎక్కి డ్రైవర్‌పై దాడి చేశాడు. బస్సులోని సీసీ కెమెరాల్లో ఈ దృశ్యాలు రికార్డు అయ్యాయి. ప్రస్తుతం ఆ సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. తమకు ఫిర్యాదు రాలేదని, డ్రైవర్ నుంచి ఫిర్యాదు వస్తే కేసు నమోదు చేస్తామని టూటౌన్ పోలీసులు తెలిపారు.

సర్వదర్శనానికి 10 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో 20 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.4.29 కోట్లు

మంగళవారం దర్శించుకున్న భక్తుల సంఖ్య 78,631

తలనీలాలు సమర్పించినవారు: 31,247

● ప్లాస్టిక్ వ్యర్థాలతో మనుగడకు పెనుసవాలు

● నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం

జీవరాశుల మనుగడలో పర్యావరణ పాత్ర కీలకం. ఆధునిక పరిస్థితుల నేపథ్యంలో రకరకాల కారణాలతో రాన్రానూ పర్యావరణ సమతుల్యం దెబ్బతింటోంది. మానవ మనుగడకు సవాలు విసురుతోంది. కాలుష్య కోరల్లోకి చేర్చుతూ ప్రమాదంలోకి నెట్టేస్తోంది. ప్రజలు, ప్రభుత్వాలు మేల్కొని బాధ్యతగా స్పందించకపోతే భావితరాల జీవనానికి పెనుముప్పు కాగలదని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు

- తిరుపతి రూరల్ (ఆంధ్రజ్యోతి)

ముప్పును మోసుకొస్తున్న సంచులు

ప్లాస్టిక్ వ్యర్థాలతో ముప్పు

ప్లాస్టిక్.. ఈతరం ప్రజల జీవితంతో విడదీయరానంతంగా పెనవేసుకుపోయింది. ఉదయం పాలప్యాకెట్లతో మొదలై ప్రతి చిన్న వస్తువుకూ కవరుగా మారిపోయింది. నగరంలో ఈ ఈ ప్రభావం మరితం ఎక్కువగా ఉంది. ప్లాస్టిక్ ఉత్పత్తుల వినియోగం పెరిగి పర్యావరణానికి, ఆరోగ్యానికి పెనుముప్పుగా తయారైంది. ప్రమాదకర వ్యాధులకు కారణమవుతోంది. పలుచగా తక్కువ బరువు ఉండటంతో యూజ్ అండ్ త్రో కవర్లను విరివిగా వాడుతున్నారు. అవసరం తీరాక ఈ సింగిల్‌యూజ్ పాలిథిన్ వ్యర్థాలను డ్రైనేజీ కాలువలు, చెత్తకుప్పలు, రోడ్డుపక్కన పడేస్తున్నారు. ఇవి భూమిలో కలిసేందుకు వేల సంవత్సరాలు పడుతుందని పర్యావరణ నిపుణులు చెబుతున్నారు. ఆవులు, గేదెలు, మేకలు, కుక్కలు లాంటిని తెలియకుండా ఆహారంగా తీసుకుని అనారోగ్యం పాలవుతున్నాయి. నిర్దేశిత ప్రమాణాలను అతిక్రమిస్తూ టీ షాపుల్లో వాడుతున్న కప్పులు, పార్శిల్ కోసం వినియోగిస్తున్న ప్లాస్టిక్ వస్తువులు క్యాన్సర్ లాంటి ప్రమాదకర వ్యాధులకు కారణమవుతున్నాయి.

నిషేధం అమలు అంతంతమాత్రమే..

తిరుపతి నగరంలో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించినా అమలు నామమాత్రంగానే ఉంది. అధికారులు చిత్తశుద్ధితో ఉద్యమంలా ప్రజల్లో అవగాహన కల్పిస్తే నిషేధానికి ముకుతాడు వేయడం కష్టమేంకాదు. అమ్ముతున్న వారిపై కేసులు పెట్టి చేతులు దులుపుకొనే కన్నా వాటి ఉత్పత్తి మూలాలను గుర్తించి కట్టడి చేయాలని పర్యావరణ నిపుణులు సూచిస్తున్నారు. కొన్ని సంస్థలు ఇప్పటికే తమ ఉత్పత్తుల ప్యాకింగుకు గుడ్డ సంచులు ఇస్తున్నాయి. ఈ సంస్కృతి అన్నిటా వ్యాపించేల చూడాలి. తిరుమలలో ప్లాస్టిక్ వాటర్‌బాటిళ్ల విక్రయాల నిషేధం మాత్రం పక్కాగా అమలవుతోంది. గాజుసీసాలను వినియోగిస్తున్నారు.



పెరుగుతున్న వాయుకాలుష్యం

తిరుమల నేపథ్యంలో భారీ సంఖ్యలో రోజూ వచ్చే వాహనాలతో పొగ కాలుష్యం పెరిగిపోతోంది. గాలిలోని పర్టిక్యులేట్‌మేటర్స్(పీఎం) కారకాలుగా పనిచేస్తున్నాయి. మూడేళ్లకు ముందు తిరుపతిలో పీఎం 2.5లెవల్స్ 22మైక్రోగ్రామ్/మీటర్‌క్యూబ్ ఉండగా..ఇటీవల 32 మైక్రోగ్రామ్/మీటర్‌క్యూబ్‌గా నమోదైనట్లు సమాచారం. పీఎం10లెవల్స్‌మూడేళ్లకు ముందు 53మైక్రోగ్రామ్/మీటర్‌క్యూబ్‌గా ఉండగా ఇప్పుడు 74మైక్రోగ్రామ్/మీటర్‌క్యూబ్‌కి చేరుకున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.. డబ్ల్యూహెచ్‌వో సిఫార్సుల మేరకు పీఎం 2.5లెవల్స్‌లో 15 మైక్రోగ్రామ్/మీటర్‌క్యూబ్‌గా, పీఎం10లెవల్స్‌లో 45 మైక్రోగ్రామ్/మీటర్‌క్యూబ్ ఉండాలి. ఈ పెరుగుదల క్రమంలోనే అనారోగ్యసమస్యలు తలెత్తుతున్నాయి. తిరుపతి పరిసరాల్లో పారిశ్రామికాభివృద్ధి, అమాంతం పెరిగిన డీజల్ వాహనాలు, వ్యర్థాల కాల్చివేత లాంటి వాటివల్ల కూడా గాలి కాలుష్యమవుతోంది. ఇది పర్యావరణానికి చేటు కలిగిస్తూ అనారోగ్యసమస్యలకు కారణమవుతోంది.

తూకివాకం వద్ద ప్లాంట్

నగరంలో రోజుకు సగటున రెండు టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు ఉత్పత్తవుతున్నాయి. వీటిలో పునర్వినియోగపరచదగినవి(రీసైకిల్), పునర్వినియోగపరచలేని(నాన్ రీసైకిల్) వేరు చేసేందుకు తూకివాకం వద్ద పీపీపీ విధానంలో(సెంట్రలైజ్డ్ యూనిట్)ఘనవ్యర్థాల నిర్వహణ ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఇది రోజుకు ఐదు టన్నుల ప్లాస్టిక్‌ని ప్రాసెసింగ్ చేసే సామర్థ్యాన్ని కలిగిఉంది. తక్కువ గ్రేడ్ ప్లాస్టిక్‌ని కూడా ఇక్కడప్రాసెస్ చేస్తున్నారు. రీయూజ్‌బుల్ కానివాటిని జిందాల్‌గ్రూప్ సంస్థతో ఒప్పందం చేసుకుని ప్రాసెస్ చేస్తున్నారని తెలిసింది.



అవగాహన పెంచాలి



ప్లాస్టిక్ వ్యర్థాలతో కలిగే అనర్థాలపై అవగాహన పెంచాలి. తరచూ సదస్సులు నిర్వహించాలి. కర్బన ఉద్గారాలు తగ్గించేందుకు విరివిగా మొక్కలు నాటాలి. సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలి. ప్రత్యామ్నాయ వినియోగాలవైపు ప్రజల దృష్టి మరల్చాలి. చిత్తశుద్ధితో పర్యవేక్షణ అవసరం. సింగిల్ యూజ్ కవర్ల ఉత్పత్తిని ఆపగలిగితే ఉత్తమం. ఎకోఫ్రెండ్లీని పెంచాలి.

- ప్రొఫెసర్ డాక్టర్ తేటి దామోదరం, పర్యావరణ శాస్త్రవిభాగ హెడ్, ఎస్వీయూ



తడి, పొడిచెత్త వేరుచేసి ఇవ్వాలి

తిరుపతి నగరంలో తడి, పొడిచెత్తలను వేరుచేయకుండా ఇస్తున్నారు. దీని నుంచి ప్లాస్టిక్ వ్యర్థాలను వేరుచేయడం కష్టంగా ఉంటోంది. ఇంటివద్దే వేరుచేసి ఇవ్వాలి. ఎక్కడపడితే అక్కడ వ్యర్థాలను పడేయడాన్ని మానుకోవాలి. ఇది అనారోగ్య సమస్యలను తెచ్చిపెడుతుంది. చెత్తను కాల్చినపుడు వచ్చే పొగతో కాలుష్యంతోపాటు అనారోగ్యసమస్యలు తలెత్తుతాయి.

-ఎన్.మౌర్య, నగరపాలకసంస్థ కమిషనర్

చెరువులో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం


మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం

పెళ్లకూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిరసనమాల చెరువులో గల్లంతైన వ్యక్తి మృతదేహాన్ని ఎస్ఐ నాగరాజు ఆధ్వర్యంలో బుధవారం అగ్నిమాపక, పోలీస్ సిబ్బంది వెలికి తీశారు. మంగళవారం సాయంత్రం దిరసనమాల గ్రామానికి చెందిన శ్రీనివాసులు(55), తన భార్య మాధవితో కలసి తప్పిపోయిన ఆవు, దూడలను వెతికేందుకు చెరువు వద్దకు వెళ్లారు. ఆవు ఒడ్డుకు చేరుకోగా దూడ చెరువు నీళ్లలో చిక్కుకుపోయింది. దూడను కాపాడానికి చెరువులోకి దిగిన శ్రీనివాసులు నీళ్లలోనే మునిగిపోయాడు. తన కళ్లముందే మునిగిపోతున్న భర్తను కాపాడ్డానికి మాధవి కేకలు వేసింది. గ్రామస్తులు గాలించినా శ్రీనివాసులు ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ నాగరాజు, వీఆర్వో భూదనం రమేష్, పంచాయతీ కార్యదర్శి సమ్మన ప్రభాకర్, అగ్నిమాపక అధికారులు చెరువు వద్దకు చేరుకున్నారు. అప్పటికే చీకటి పడడంతో గాలింపు చర్యలకు అంతరాయం ఏర్పడింది. దీంతో బుధవారం తిరిగి గాలింపు చర్యలు కొనసాగించారు. ఉదయాన్నే శ్రీనివాసులు మృతదేహం చెరువు నీటిపై తేలియాడడంతో వెలికితీసి నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ఆస్పత్రి వద్దకు చేరుకుని మృతుని కుటుంబసభ్యులను ఓదార్చారు. పంచనామ అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక తవ్వకాలను అడ్డుకున్నరైతులు


హిటాచిని అడ్డుకున్న గ్రామస్తులు

పెళ్లకూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): స్వర్ణముఖినదిలో జరుగుతున్న ఇసుక తవ్వకాలను దిగువ కలవకూరు సమీపంలో రైతులు అడ్డుకున్నారు. మండలంలోని ఎగువ కలవకూరు, పుల్లూరు గ్రామాల సమీపంలోని స్వర్ణముఖినదిలో పూడికతీత అవసరమని భావించి కూలీలతో ఇసుకను తరలించేందుకు అధికారులు అనుమతులు ఇచ్చారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా భారీ యంత్రాలతో ఇసుకను ఇష్టానుసారంగా తవ్వి తరలిస్తుండంతో చింతపూడి గ్రామానికి చెందిన రైతులు అడ్డుకున్నారు. దీంతో వాహనదారులకు, రైతులకు నడుమ కాసేపు వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో గ్రామస్తులు ధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పుల్లూరు, కలవకూరు, చింతపూడి పరిధిలోని స్వర్ణముఖినదిలో తాగు, సాగునీటి బోరుబావులు ఉన్నాయన్నారు. అలాంటి ప్రాంతంలో పూడికతీత పేరుతో అనుమతులు ఇవ్వడం సరికాదన్నారు. ఇసుక తరలిస్తే బావులు ఎండిపోయి పంటల సాగు కష్టమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పూడికతీత పేరుతో ఇచ్చిన అనుమతులను రద్దుచేయాలని కోరారు.

ఉగ్రవాదులపై నిరంతర అప్రమత్తత అవసరం

● భద్రతా దళాలు, టీటీడీ సిబ్బందితో ఏఎస్పీ


సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ రామకృష్ణ

తిరుమల, జూన్4(ఆంధ్రజ్యోతి): తిరుమల క్షేత్రంలో అలజడి సృష్టించేందుకు ఏరూపంలో ఉగ్రవాదులొచ్చినా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు భద్రతాదళాలతో పాటు అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఏఎస్పీ రామకృష్ణ అన్నారు. తిరుమల ఆస్థానమండపంలో టీటీడీ విజిలెన్స్, సివిల్ పోలీసు, ఏఆర్, ఏపీఎస్పీ, ఎస్పీఎఫ్, ఫైర్‌తో పాటు టీటీడీ అధికారులు, సిబ్బంది, అర్చకులు, పోటు కార్మికులు, ట్యాక్సీ డ్రైవర్లు, మఠాల నిర్వాహకులతో ఆయన బుధవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ.. ఉగ్రవాదులు మనలోనే కలిసిపోయి హింస సృష్టించేందుకు ప్రణాళికలు రూపొందిస్తుంటారన్నారు. కూలీల ముసుగులోనూ వచ్చే అవకాశాలుంటాయన్నారు. కొన్ని సందర్భాల్లో మనం గుర్తించే చిన్నచిన్న విషయాలే పెద్ద విపత్తుల నుంచి రక్షించేందుకు ఉపయోగపడతాయన్నారు. సూరత్‌లో ఉగ్రవాదులు అమర్చిన బాంబులను స్థానికులే గుర్తించడంతో దాదాపు 29 బాంబుల నుంచి ప్రజలు ప్రాణాలతో బయటపడ్డారని సోదాహరించారు. ఇదే తరహాలో దేశంలోని పలు ఆలయాల్లో జరిగిన ఉగ్రదాడులు, అక్కడ జరిగిన నష్టం, ఎలా బ్లాస్టులు చేశారు వంటి వివిధ అంశాలను స్ర్కీన్‌పై ప్రదర్శించారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు కనిపిస్తే ఎలా స్పందించాలి, తక్షణం చేపట్టాల్సిన చర్యల గురించి వివరించారు.

సింహ వాహనంపై అనంత తేజోమూర్తి





తిరుపతి అర్బన్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): నగరంలో గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం ఉదయం మాడ వీధుల్లో సింహ, రాత్రి ముత్యపు పందిరి వాహనాల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. వాహనం ముందు గజరాజులు, గోవులు ఠీవీగా నడుస్తుండగా కళాబృందాలు కోలాటాలు, వివిధ వేషధారణలు ఆకట్టుకున్నాయి.మంగళవాయిద్యాల నడమ ఈ ఉత్సవం కోలాహలంగా సాగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామిని దర్శించుకున్నారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం కన్నుల పండువగా నిర్వహించారు. సాయంత్రం ఊంజల్ సేవ నిర్వహించారు. ఉత్సవాల్లో జియ్యంగార్లు, టీటీడీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జేమ్స్‌పై దాడి కేసులో మరో ఆరుగురి అరెస్టు

తిరుపతి(కలెక్టరేట్),జూన్4(ఆంధ్రజ్యోతి): రంగంపేటలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్న జేమ్స్‌పై గతనెల 14న జరిగిన దాడిలో 18మందిపై కిడ్నాప్, హత్యాయత్నం, అట్రాసిటీ కేసులు నమోదయ్యాయి. రెండు రోజుల క్రితం ప్రధాన నిందితుడు యశ్వంత్‌తో పాటు 12మందిని తిరుచానూరు పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపించారు. బుధవారం ఈ కేసులో ప్రమేయమున్న చోటా బ్లేడ్, దీపక్‌కుమార్, జగదీష్, సాయి హరితేజ, రూపేష్, సోమశేఖర్‌లను పాడిపేట శేషాద్రినగర్ వద్ద అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సునీల్‌కుమార్, ఎస్ఐ సాయినాథ్ చౌదరి తెలిపారు.రూపేష్‌పై రౌడీషీట్, చోటా బ్లేడ్, జగదీష్‌లపై క్రిమినల్ కేసులు ఉన్నాయని వివరించారు. కాగా, అరెస్టు అయిన ఆరుగురూ వైసీపీకి చెందిన మాజీ మంత్రి, తిరుపతి మాజీ డిప్యూటీ మేయర్ అనుచరులే కావడం గమనార్హం.

ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్‌గా చరణ్

తిరుపతి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఏపీఐఐసీ తిరుపతి జోన్ డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా రుద్రరాజు చరణ్ నియమితులు కానున్నారు. ప్రస్తుతం స్టేట్ ఆడిట్ శాఖలో స్పెషల్ క్యాడర్ అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్‌గా తిరుపతిలో పనిచేస్తున్న చరణ్‌ను ప్రభుత్వం బుధవారం పరిశ్రమల శాఖకు డెప్యుటేషన్‌పై బదిలీ చేసింది. ఆ శాఖలో ఆయన ఏపీఐఐసీ తిరుపతి జోన్‌కు డిప్యూటీ జోనల్ మేనేజర్ (అసెట్ మేనేజ్‌మెంట్) పోస్టులో నియమితులు కానున్నారు. డెప్యుటేషన్‌పై ప్రాథమికంగా ఆయన సంబంధిత పోస్టులో ఏడాది పాటు కొనసాగనున్నారు. పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్.యువరాజ్ బుధవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

యూనివర్సిటీల్లో అభివృద్ధి ఇలా..!

● వర్సిటీ అధికారుల సమావేశంలో ఎస్వీయూ, పద్మావతి అధికారుల నివేదన


సమావేశంలో పాల్గొన్న ఎస్వీయూ, పద్మావతి వర్సిటీ అధికారులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ, పద్మావతి యూనివర్సిటీలను ఈ విధంగా అభివృద్ధి చేస్తున్నామంటూ ఆయా యూనివర్సిటీల అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. విజయవాడలో ఉన్నత విద్యామండలి చైర్మన్ మధుమూర్తి, ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్ బుధవారం నిర్వహించిన యూనివర్సిటీ అధికారుల సమావేశంలో ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, పద్మావతి వర్సిటీ వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని పాల్గొన్నారు. ఇటీవల యూనివర్సిటీల్లోని పరిణామాలు, కొత్త కార్యక్రమాలు, కొత్త లక్ష్యాలను వారు రాష్ట్ర ఉన్నత విద్యామండలికి వివరించారు. బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో అభివృద్ధిని ప్రామాణికంగా, వేగవంతంగా చేపట్టడం ద్వారా ప్రపంచ స్థాయి ర్యాంకులను యూనివర్సిటీలు సొంతం చేసుకోవాలని ఉన్నత విద్యామండలి అధికారులు సూచించారు.

వేద వర్సిటీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

● దరఖాస్తుకు ఈనెల 10 చివరి గడువు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు),జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వేద విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న పలు కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చు.సమగ్ర సమాచారం కోసం.. వేదిక్ యూనివర్సిటీ.. పేర గల వెబ్‌సైట్ చూడాలని ఆ వర్సిటీ పీఆర్వో డాక్టర్ బ్రహ్మాచార్యులు కోరారు.


జాబ్‌మేళా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

10న నాయుడుపేటలో మెగా జాబ్‌మేళా

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నాయుడుపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 10వ తేదీన మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. జాబ్‌మేళా పోస్టర్లను ఆవిష్కరించిన కలెక్టర్ మాట్లాడుతూ ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందని, శ్రీసిటీ, మేనకూరు సెజ్, ఈఎంసీ క్లస్టర్, తిరుపతి, చెన్నైలోని 17 బహుళజాతి కంపెనీల్లో 900కు పైగా ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. 5వ తరగతి పైన, పదవ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ, పీజీలో ఉత్తీర్ణులైన యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంబంధిత లింక్‌లో ఈనెల 9వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9985056929, 9154449677లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం, జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి గణేష్ పాల్గొన్నారు.

వందశాతం ఇంటింటి చెత్తసేకరణ జరగాలి

ప్రభుత్వ కార్యాలయాలు, ముఖ్య ప్రదేశాల్లోని గోడలపై పోస్టర్లు అతికించొద్దు: కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో వందశాతం మేర ఇంటింటి చెత్తసేకరణ జరగాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి మున్సిపల్ కమిషనర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సచివాలయాల పరిధిలో చెత్తసేకరణపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంతకంతో నివేదిక తయారుచేసి సమర్పించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, ముఖ్యమైన ప్రదేశాల గోడలపై పోస్టర్లను అతికించరాదని, ఇప్పటికే ఉన్న పోస్టర్లను తొలగించాలన్నారు. మున్సిపాలిటీల్లో పన్నుల వసూళ్లు సమర్థవంతంగా జరపాలన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరం పన్ను వివరాలతో పాటు 2025-26లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై కార్యాచరణ రూపొందించి, సమర్పించాలన్నారు. వీధిదీపాలకు మరమ్మతులు చేయాలని, విరిగిన చెత్తకుండీల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయాలని, డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని చెప్పారు. చిత్తూరు, కుప్పం, పలమనేరు, పుంగనూరు, నగరి మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

టీచర్ల సమస్యల పరిష్కారానికి హెల్ప్ డెస్క్


ఆర్జేడీకి సమస్యలు వివరిస్తున్న ఎస్టీయూ రాష్ట్ర నాయకుడు గంటా మోహన్

చిత్తూరు సెంట్రల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): టీచర్ల బదిలీలు, పదోన్నతుల్లో తలెత్తుతున్న సమస్యల పరిష్కారానికి హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు ఆర్జేడీ శామ్యూల్ తెలిపారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఎస్ఏ (స్కూల్ అసిస్టెంట్) ఖాళీల ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నేతలు, ఉపాధ్యాయులు వారికి ఎదురైన సమస్యలను ఆర్జేడీ దృష్టికి తెచ్చారు. ఆర్జేడీ మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారానికి తిరుపతి డీఈవో కేవీఎన్ కుమార్ ఆధ్వర్యంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వెబ్ ఆప్షన్ పెట్టుకోడానికి గడువు పెంచాలని ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ గంటా మోహన్, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రమణ, నాయకులు మదన్‌మోహన్, చెంగల్రాయమందడి తదితరులు ఆర్జేడీకి విన్నవించారు. కాగా, స్కూల్ అసిస్టెంట్ల బదిలీలకు వెబ్ ఆప్షన్ నమోదు ప్రక్రియ పూర్తయ్యింది.

వైఎస్ఆర్ క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు క్రీడలు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలోని వైఎస్ఆర్ క్రీడా పాఠశాలలో 4, 5వ తరగతులు ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎస్‌డీవో బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19వ తేదీలోపు https://apsportsschool.ap.gov.in/ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. నాల్గవ తరగతికి బాలురు 20, బాలికలు 20 మొత్తం 40, 5వ తరగతికి బాలురకు 20, బాలికలకు 20 చొప్పున 40 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఇతర వివరాలకు పైనున్న వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

మార్కెటింగ్ శాఖకు రూ.94.62 లక్షల ఆదాయం

చిత్తూరు సెంట్రల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా మార్కెటింగ్ శాఖకు మే నెల ఆదాయం కింద రూ.94.62 లక్షలు సమకూరినట్లు ఏడీ పరమేశ్వరన్ తెలిపారు. బుధవారం తన చాంబర్‌లో మాట్లాడుతూ.. 2025-26 వార్షిక లక్ష్యం రూ.10.10 కోట్లు కాగా, జిల్లావ్యాప్తంగా 10 మార్కెట్ల ద్వారా మే నెలలో ఈ ఆదాయం సమకూరినట్లు చెప్పారు. అత్యధికంగా పుంగనూరు మార్కెట్ ద్వారా రూ.3.42లక్షలు, అత్యల్పంగా సోమల మార్కెట్ ద్వారా రూ.69 వేలు వచ్చిందన్నారు. మిగిలిన మార్కెట్ల వారీగా.. చిత్తూరులో రూ.15.31 లక్షలు, పలమనేరులో 29.18 లక్షలు, బంగారుపాళ్యంలో రూ.4.94 లక్షలు, నగరిలో రూ.91 వేలు, కుప్పంలో రూ.9.13 లక్షలు, పెనుమూరులో రూ.1.62 లక్షలు, రొంపిచెర్లలో రూ.98 వేలు, ఎస్ఆర్ పురంలో రూ.1.44 లక్షలు ఆదాయం సమకూరినట్లు ఏడీ తెలిపారు. జూన్ నెలలో ఆదాయ వనరులు మరింత మెరుగుపర్చనున్నట్లు చెప్పారు.

విద్యాబోధనలో ఏకాగ్రత ముఖ్యం

● డీసీఈబీ కార్యదర్శి హేమాద్రి


యోగాపై శిక్షణ ఇస్తున్న కోమల

చిత్తూరు సెంట్రల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): విద్యాబోధనలో ఏకాగ్రత ఎంతో ముఖ్యమని జిల్లా ఉమ్మడి పరీక్షా కేంద్రం కార్యదర్శి హేమాద్రి అన్నారు. విద్యావిధానంలోని పలు అంశాలపై స్కూల్ అసిస్టెంట్లు, హెచ్‌ఎంలకు శిక్షణలో భాగంగా బుధవారం స్థానిక గిరింపేటలోని మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో తరగతులు కొనసాగాయి. విద్యార్థులకు బోధన చేయడంలో మెలకువలు, సామర్థ్యాల పెంపునకు సూచనలు, హ్యాండ్‌బుక్ రాయడం, షెడ్యూల్ ప్రకారం సిలబస్ పూర్తిచేయడంతోపాటు యోగా చేయడం ద్వారా కలిగే ప్రయోజనాలను మాస్టర్ ట్రైనీ హెచ్‌ఎం కోమల శిక్షణ తరగతుల్లో వివరించారు. 190 మందికి 164 మంది శిక్షణలో పాల్గొన్నట్లు హేమాద్రి తెలిపారు.

పీహెచ్‌సీల్లో గర్భిణుల నమోదు పక్కాగా జరగాలి

● కలెక్టర్ సుమిత్‌కుమార్


వైద్యాధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మాతా, శిశు సంరక్షణలో భాగంగా ప్రతి పీహెచ్‌సీలో గర్భిణుల నమోదు పక్కాగా జరగాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో వైద్యాధికారులతో సమీక్షించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు సరైన పోషకాహారం అందించడం ద్వారా రక్తహీనత సమస్య నివారించవచ్చని చెప్పారు. గర్భిణులు ప్రసవించేవరకు ఏఎన్‌ఎంలు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. పుట్టిన ప్రతి బిడ్డకు రిజిస్ట్రేషన్ చేయడం ద్వారా వారికి నిర్ధేశించిన సమయంలో వ్యాక్సినేషన్‌ను ఎప్పటికప్పుడు అందించేందుకు అవకాశం ఉందన్నారు. పసిపిల్లల ఆరోగ్య స్థితుల అంశంలో మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. టీబీ ముక్త్ భారత్ కార్యక్రమం ద్వారా హైరిస్క్ పాపులేషన్‌ను సర్వే చేసి గళ్ల పరీక్షలు చేయించి పాజిటివ్ కేసులు వచ్చినవారికి పూర్తి చికిత్సతోపాటు రూ.100 అందించనున్నట్లు ఆయన చెప్పారు. ఈ సమావేశంలో డీటీ సుధారాణి, డిప్యూటీ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్, డీఐవో హనుమంతరావు పాల్గొన్నారు.

వరసిద్ధుడి ఆలయ క్యూలైన్‌లో దొరికిన

లక్ష్మీకాసు వెనుక తిరకాసు

ఐరాల(కాణిపాకం), జూన్ 4 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధుడి దర్శనార్థం హైదరాబాద్‌కు చెందిన ఓ కుటుంబం బుధవారం విచ్చేశారు. వారు ఆలయ క్యూలైన్‌లో వస్తున్న సమయంలో మహిళ మెడలోని పూసలతో కూడిన లక్ష్మీకాసులు రెండు కింద పడిపోయాయి. వారు ఈ విషయాన్ని గమనించకుండా స్వామిని దర్శించుకుని ఆలయం బయటకు వచ్చేశారు. అయితే క్యూలైన్ల వద్ద విధులు నిర్వహిస్తున్న ఒక హోంగార్డుకు ఈ బంగారు లక్ష్మీ కాసులు దొరికాయి. సదరు హోంగార్డు వాటిని కాణిపాకానికి చెందిన ఓ వ్యక్తికి అందించాడు. దర్శనం పూర్తి చేసుకుని ఆలయం వెలుపలకు విచ్చేసిన భక్తురాలు తన లక్ష్మీకాసులు పడిపోయిన సంగతిని గుర్తించి.. వెంటనే ఈవో పెంచలకిషోర్‌కు ఫిర్యాదు చేసింది. ఆయన సీసీ ఫుటేజీలను పరిశీలించగా.. లక్ష్మీ కాసులు తీసుకున్న వ్యక్తి ఒక కాసును ఆలయ హుండీలో వేసి, రెండో దానిని తన ప్యాంట్ జేబులో వేసుకోవడాన్ని గుర్తించారు. దీంతో ఆ భక్తురాలు తన వద్ద మిగిలి ఉన్న లక్ష్మీకాసులను సైతం హుండీలో వేసింది. అయితే హోంగార్డు లక్ష్మీ కాసులను వేరే వ్యక్తికి ఇవ్వడంపై గురువారం విచారణ నిర్వహించనున్నట్లు తెలిసింది.

రేపటినుంచి మెగా డీఎస్సీ పరీక్షలు

● 23,500 మంది అభ్యర్థుల కోసం 8 పరీక్షా కేంద్రాల గుర్తింపు

చిత్తూరు సెంట్రల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ పరీక్షలు శుక్రవారం నుంచి మొదలు కానున్నాయి. ఈనెల 30వ తేదీ వరకు జరిగే పరీక్షల నిమిత్తం విద్యాశాఖ అధికారులు చిత్తూరు, చెన్నై ప్రాంతాల్లో ఎనిమిది పరీక్ష కేంద్రాలు గుర్తించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1,478 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇందుకోసం రెండు విభాగాలుగా దరఖాస్తులు వచ్చాయి. జనరల్ కేటగిరీలో 1,324 పోస్టులు, దివ్యాంగుల కేటగిరీలో 149 పోస్టులు కేటాయించారు. జనరల్ కేటగిరీలో ఒక్కో అభ్యర్థి ఒక్క పోస్టుకు మించి దరఖాస్తు చేసుకున్నారు. మొత్తంగా 26,501 మంది అభ్యర్థులు ఏకంగా 45,221 దరఖాస్తులు చేసుకున్నారు. దరఖాస్తుల చేసుకున్న వారిలో 10,153 మంది పురుషులు, 16,348 మంది మహిళలు ఉన్నారు. దివ్యాంగుల కేటగిరీలో 149 పోస్టులకు 2,461 దరఖాస్తులు వచ్చాయి. పలు కారణాలతో 2,701 దరఖాస్తులు తిరస్కరణకు గురవగా.. మొత్తానికి 23,500 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారు.

నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు

రోజూ మొదటి సెషన్‌లో ఉదయం 9/9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో సెషన్‌లో మధ్యాహ్నం 2/2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. సూచించిన సమయానికంటే గంట ముందే అభ్యర్థులు పరీక్ష కేంద్రం వద్దకు చేరుకోవాలి. ఎందుకంటే నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతించరు. గుర్తింపు కార్డు (ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఓటరు ఐడీ) తప్పనిసరిగా తీసుకురావాలి. ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరు.

హెల్ప్‌డెస్క్: అభ్యర్థులు సలహాలు, సందేహాలు నివృత్తి చేసుకోవడానికి చిత్తూరు డీఈవో కార్యాలయంలో 90321 85001 నెంబరుతో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు.

పరీక్ష కేంద్రాలు ఇవే

చిత్తూరు జిల్లాలో నాలుగు కేంద్రాలతో పాటు చెన్నైలోనూ నాలుగు పరీక్ష కేంద్రాలను అధికారులు గుర్తించారు. చిత్తూరు జిల్లాలో తిరుపతి రోడ్డులోని ఆర్‌వీఎస్ నగర్‌లో శ్రీవెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ(ఎస్వీసెట్), జిల్లా కేంద్రమైన చిత్తూరులోని మురకంబట్టు బెంగళూరు-తిరుపతి బైపాస్‌లో శ్రీనివాస ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ (సీతమ్స్), తిరుపతి జాతీయ రహదారి పి.కొత్తకోట సమీపంలోని వేము ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, పలమనేరులో మదర్ థెరిసా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలను పరీక్ష కేంద్రాలుగా గుర్తించారు. చెన్నైలో ఓఎంఆర్ రోడ్డు కొట్టివాక్కమ్ నెహ్రూనగర్‌లో బ్లూ లోటస్ టెక్నాలజీస్ ప్రైవేటు లిమిటెడ్, పెరంబూర్ సెయింట్ మేరీస్ రోడ్డులోని చీవలైర్ టి.థామస్ ఎలిజబెత్ కాలేజ్ ఆఫ్ ఉమెన్స్, క్రోమ్‌పేట్ ప్రశాంత్‌నగర్ భారతీయార్ స్ట్రీట్‌లోని మహాలక్ష్మి టెక్ క్యాంపస్, చెంగల్‌పట్టు జిల్లా మేడవాక్కం మెయిన్ రోడ్డు, ముంబాకంలోని ప్రిన్స్ డాక్టర్ కె.వాసుదేవన్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలను పరీక్ష కేంద్రాలుగా గుర్తించారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం



క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్ - తలపడుతున్న క్రీడాకారులు



చిత్తూరు క్రీడలు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులోని మెసానికల్ మైదానంలో రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ అండర్-23 మహిళ, పురుషుల చాంపియన్‌షిప్ పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. చిత్తూరు బాస్కెట్‌బాల్ అసోసియేషన్, రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలను చిత్తూరు ఎమ్మెల్యే జగన్మోహన్ ప్రారంభించి, ప్రసంగించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. బాస్కెట్‌బాల్ జిల్లా అధ్యక్షుడు చెంగల్రాయ నాయుడు మాట్లాడుతూ 13 జిల్లాల నుంచి క్రీడాకారులు పోటీలకు తరలివచ్చారన్నారు. గెలుపొందిన జట్టు కేరళ రాష్ట్రంలోని కొచ్చిన్‌లో ఈనెల 12 నుంచి జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి అమాస రాజశేఖర్‌రెడ్డి, టీడీపీ నాయకులు జయప్రకాష్, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు గిరిజనులకు అందించాలి

● జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి మూర్తి


సమావేశంలో మాట్లాడుతున్న మూర్తి

పలమనేరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను వారికి అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి ఎస్.మూర్తి సూచించారు. బుధవారం పలమనేరు మండలం జగమర్ల పంచాయతీలోని దేవళంపేటలో అధికారులతో కలిసి గ్రామసభ నిర్వహించారు. గిరిజనులకు అందుతున్న పథకాలు, పంటల సాగు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు గిరిజనులకు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. దేశంలో గిరిజనులు ఎక్కువగా ఉన్న 63,243 గ్రామాలను కేంద్ర ప్రభుత్వం గుర్తించిందని తెలిపారు. దేవళంపేటలో 194 కుటుంబాలు ఉండగా.. 110 కుటుంబాలు గిరిజనులు ఉన్నారన్నారు. ఈ సందర్భంగా తమ గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని, మరుగునీటి కాలువలు నిర్మించాలని, అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని, కొందరికి ఆధారు కార్డులు లేవని, ఆవులు, మేకలు, కొనుగోలు చేసుకునేందుకు రుణాలు మంజూరు చేయాలని గిరిజనులు కోరారు. భూగర్భజలాల శాఖ డీడీ గోవర్ధన్‌రెడ్డి, జిల్లా మత్స్యశాఖ ఏడీ రవీంద్రరెడ్డి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గుణశేఖర్‌రెడ్డి, పలమనేరు ఏవో సంధ్య పాల్గొన్నారు.

కొవిడ్‌ను కట్టడి చేసేలా..!

● తిరుపతి జిల్లాలో తొలి కేసు నమోదుతో అప్రమత్తమైన వైద్యాధికారులు

● రుయా, స్విమ్స్‌లో పరీక్షా కేంద్రాలు, ఐసీయూ పడకలు సిద్ధం


రుయాస్పత్రిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఐసీయూ పడకలు

తిరుపతి(వైద్యం), జూన్ 4 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లాలో తొలి కొవిడ్ కేసు నమోదుతో వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు. కొవిడ్ వ్యాప్తి చెందినా ఎదుర్కొనేలా చర్యలు చేపట్టారు. ఇప్పుడు కొత్తగా ఎన్‌బీ.1.8.1, ఎల్ఎఫ్.7 వేరియంట్లలో కొవిడ్ వ్యాపిస్తున్నట్లు వైద్యాధికారులు గుర్తించారు. ఇప్పటికే రాష్ట్రంలో నాలుగు కేసులు రాగా.. అందులో జిల్లాలో పది నెలల చిన్నారి ఉన్నారు. ఈ నేపథ్యంలో అధికారులు అప్రమత్తమై కొవిడ్ కట్టడి దిశగా సన్నద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా స్విమ్స్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కొవిడ్ వార్డులో ఆరు వెంటిలేటర్ పడకలతోపాటు మరో పది ఆక్సిజన్ పడకలను సిద్ధం చేశారు. 22 టన్నుల సామర్థ్యం కలిగిన ఆక్సిజన్ ప్లాంటు స్విమ్స్‌లో ఉండటం వల్ల భవిష్యత్తులో ఆక్సిజన్‌కు ఎటువంటి ఇబ్బంది రాదని వైద్యాధికారులు చెప్పారు. ఆర్టీపీసీఆర్, రాపిడ్ కిట్లు కూడా సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయన్నారు. ఇక, రుయాస్పత్రిలోని ప్రత్యేక కొవిడ్ వార్డులో 40 ఐసీయూ పడకలను అధికారులు సిద్ధం చేశారు. మూడు ఆక్సిజన్ ప్లాంట్లు అందుబాటులో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రసూతి ఆస్పత్రిలోనూ గర్భిణుల కోసం ప్రత్యేక కొవిడ్ వార్డును సిద్ధం చేయడంతో పాటు సిబ్బందినీ నియమించారు. అలాగే 3కేఎల్, 6కేఎల్ సామర్థ్యం కలిగిన రెండు ఆక్సిజన్ ప్లాంట్లు అందుబాటులో ఉన్నాయి. కొవిడ్ ఏ దశలో వచ్చినా సమర్థంగా ఎదుర్కొనేలా సిద్ధమైనట్లు అధికారులు చెబుతున్నారు.

పీహెచ్‌సీల్లోనూ రాపిడ్ పరీక్షలు



స్విమ్స్, రుయాస్పత్రిలో కొవిడ్ పరీక్ష కేంద్రాలున్నా అవసరాన్ని బట్టి పీహెచ్‌సీల్లో కూడా రాపిడ్ పరీక్షలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశాం. ప్రజలూ కొవిడ్ నిబంధనలు పాటించేలా అవగాహన కల్పించాలని చెప్పాం. ఏ వేరియంట్‌లో కొవిడ్ వచ్చినా ఎదుర్కొనేందుకు అవసరమైన మందులు, వైద్యులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉన్నారు. ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉంటే మొదట్లోనే కొవిడ్‌ను పూర్తిగా కట్టడి చేసే అవకాశం ఉంటుంది.

- డాక్టర్ బాలకృష్ణ నాయక్, డీఎంహెచ్‌వో

చిన్నారుల పట్ల జాగ్రత్త



చిన్నపిల్లల విషయంలో తల్లిదండ్రులు చాలా జాగ్రత్తగా ఉండాలి. చిన్నారుల్లో చిన్నపాటి దగ్గు, జలుబు, జ్వరం వంటి లక్షణాలు కనిపించినా వెంటనే వైద్యులను సంప్రదించి వైద్య సలహాలు తీసుకోవాలి. సొంతంగా మందులు వాడటం మంచిది కాదు. నెలలు నిండని చిన్నారుల విషయంలో మరీ జాగ్రత్తలు పాటించాలి. వీరిని వీలైనంత వరకు బయటకు తీసుకురాకపోవడం ఉత్తమం. చిన్నారుల తల్లిదండ్రులూ బయట తిరిగేసమయంలో కొవిడ్ నిబంధనలు పాటించడం మంచిది.

- డాక్టర్ మనోహర్, చిన్నపిల్లల విభాగాధిపతి, రుయాస్పత్రి

గర్భిణులు అప్రమత్తంగా ఉండాలి



రద్దీ ప్రాంతాల్లో తిరగకపోవడం గర్భిణులకు మంచిది. అలాగే ఒంట్లో నలతగా ఉన్నా, జ్వరం, ఎక్కువ రోజులు జలుబు వంటివి ఉన్నా వైద్య పరీక్షలు చేయించుకోవాలి. పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలి. రక్తహీనతతో బాధపడే గర్భిణులు ఎంతో అప్రమత్తంగా ఉండాలి. ప్రధానంగా కొవిడ్ నిబంధనలు పాటించాలి.

- డాక్టర్ పార్థసారథిరెడ్డి, సూపరింటెండెంట్, ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి

కొవిడ్ బారిన పడిన చిన్నారిని తీసుకెళ్లిన తల్లిదండ్రులు

రుయా చిన్నపిల్లల విభాగంలో కొవిడ్ బారిన పడి చికిత్స పొందుతున్న పది నెలల చిన్నారిని తల్లిదండ్రులు సిబ్బందికి తెలియకుండా బుధవారం తీసుకెళ్లి పోయారు. ఏర్పేడు మండలం పాపానాయుడుపేట ప్రాంతానికి చెందిన ఈ చిన్నారికి సోమవారం స్విమ్స్‌లో నిర్వహించిన ఆర్టీపీసీఆర్ పరీక్షలో కొవిడ్ పాజిటివ్ వచ్చింది. దీంతో మంగళవారం నుంచి ఆ చిన్నారిని రుయా చిన్నపిల్లల విభాగంలో ప్రత్యేక వార్డులో ఉంచి చికిత్స అందిస్తుండగా, తల్లిదండ్రులు తీసుకెళ్లిపోయారు. ఈ విషయం తెలిసి బుధవారం వైద్యులు, వైద్య సిబ్బంది ఆస్పత్రి పరిసరాల్లో వెతికినా వారి జాడ తెలియరాలేదు. చిన్నారి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని, ఎటువంటి భయం అవసరం లేదని చిన్నపిల్లల విభాగం వైద్యులు పేర్కొన్నారు.

వేరుశనగ విత్తనాలకు రిజిస్ట్రేషన్లు ప్రారంభం


పెద్దపంజాణి ఆర్ఎస్‌కేలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖాధికారి మురళీకృష్ణ

చిత్తూరు సెంట్రల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): వేరుశనగ విత్తనాల కోసం రైతు సేవా కేంద్రా(ఆర్ఎస్‌కే)ల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. చిత్తూరు, గుడిపాల, బంగారుపాళ్యం, వెదురుకుప్పం, బైరెడ్డిపల్లె, గుడుపల్లె, కుప్పం, శాంతిపురం, వి.కోట, పెద్దపంజాణి, పుంగనూరు మండలాల్లోని ఆర్ఎస్‌కేల్లో వేరుశనగ విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించారు. తొలి రోజున 1881 క్వింటాళ్ల (6272 బస్తాల) వేరుశనగ విత్తనాల కోసం 5,220 మంది రైతులు నమోదు చేసుకున్నట్లు వ్యవసాయ శాఖాధికారులు తెలిపారు. చిత్తూరు రూరల్, గుడిపాలలో చేపట్టిన పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే జగన్మోహన్ మినహా మిగిలిన చోట్ల ద్వితీయ, తృతీయ శ్రేణి ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ విత్తనాలు ఎప్పుడిస్తారు సారూ?

వేరుశనగ విత్తనాలతోపాటు 312 క్వింటాళ్ల కందులు మాత్రమే ఇస్తున్నారు. విత్తనాలతోపాటు విత్తన శుద్ధి మందు ఇవ్వక పోవడంపై రైతులు నిరాశ చెందుతున్నారు. ఇదిలా ఉండగా, విత్తనాల పంపిణీలో భాగంగా పెసలు 37 క్వింటాళ్లు, ఉలవలు 1720 క్వింటాళ్లు, రాగి 280 క్వింటాళ్లు, పచ్చరొట్ట 378 క్వింటాళ్లు, ఎండు జనపనార 1156 క్వింటాళ్ల విత్తనాలు ఇవ్వాల్సి ఉంది. వీటిని రైతులకు అందజేయడంపై వ్యవసాయాధికారులు దృష్టి సారించకపోవడం పలు విమర్శలకు దారితీస్తోంది.

ప్రభుత్వ కార్యాలయాల్లో సోలార్ రూఫ్‌టాప్

● ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్న కలెక్టర్


జిల్లాస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయయాల్లో అవకాశం ఉన్నమేర సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో పీఎం సూర్యఘర్ యోజన అమలుపై ట్రాన్స్‌కో నెడ్‌క్యాప్, జడ్పీ, రెస్కో, డీఆర్డీఏ, సంబంధిత శాఖల అధికారులతో జిల్లాస్థాయి ద్వితీయ కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ.. సూర్యఘర్‌పై వినియోగదారులకు ఏర్పడే సందేహాలను నివృత్తి చేసేందుకుగాను మండల, గ్రామ కమిటీ సమావేశాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మండలస్థాయి కమిటీల్లో డీఆర్డీఏ ఏపీవోలు, ట్రాన్స్‌కో ఏఈలు, బ్యాంకర్లు ఉంటారని, గ్రామస్థాయి కమిటీల్లో సచివాలయ సిబ్బంది, డీఆర్డీఏ, మెప్మా సిబ్బంది, బ్యాంకు అధికారులు సభ్యులుగా ఉంటారన్నారు. రూఫ్‌టాప్ ఏర్పాటుకు మహిళలకు స్త్రీనిధి, ఉన్నతి, బ్యాంకుల ద్వారా రుణసహాయం అందిస్తారన్నారు. ఈ సమావేశంలో జేసీ విద్యాధరి, ట్రాన్స్‌కో ఎస్ఈ ఇస్మాయిల్, నెడ్‌క్యాప్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ అబ్దుల్ గయాజ్, జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, డీపీవో సుధాకర్ రావు, రెస్కో ఎండీ సోమశేఖర్, డీఆర్డీఏ పీడీ శ్రీదేవి పాల్గొన్నారు.

టీడీపీలో యువతకు ప్రాధాన్యం



హరికి శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నేతలు

రామకుప్పం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆవిర్భావం నుంచి యువతకు ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని టీడీపీ రామకుప్పం మండలాధ్యక్షుడు ఆనంద రెడ్డి, తెలుగు యువత అధ్యక్షుడు విశ్వనాథ్ తెలిపారు. బుధవారం పంద్యాలమ డుగులో జరిగిన తెలుగు యువత సమావేశంలో వారు మాట్లాడుతూ టీడీపీ రాజకీయంగా యువతకు అధిక ప్రాధాన్యత ఇవ్వడమే కాకుండా అధికారంలో ఉన్న ప్రతిసారి యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో ముందుందన్నారు. అనంతరం స్థానిక యువనేత హరి పుట్టినరోజు సందర్భంగా నేతలు, కార్యకర్తలు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పట్రనారాయణాచారి, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు ఆంజినేయరెడ్డి, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణానాయక్, తెలుగుయువత మండల అధ్యక్షుడు విశ్వనాథ్, వైస్ఎంపీపీ వెంకట్రామగౌడు, నేతలు గుర్రప్ప, నరసింహులు, గంట్లప్పగౌడు, మహ్మద్‌రఫీ, మనోహర్, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఊటూరుతాండాలో తాగునీటి సమస్యకు పరిష్కారం



కుళాయిల నుంచి నీటిని పంపిణీ చేస్తున్న అధికారులు, టీడీపీ నాయకులు

పుంగనూరు రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాల్యెం పల్లె పంచాయతీ ఊటూరుతాండాలో తాగునీటిని పంపిణీ చేసి అధికారులు సమస్యకు పరిష్కారం చూపారు. గ్రామంలో బోరు వేసి బుధవారం కుళాయిల నుంచి తాగునీరు పంపిణీ చేశారు. ఎంపీడీవో లీలామాధవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చందన, టీడీపీ నాయకులు మాధవరెడ్డి, సీవీరెడ్డి, కృష్ణానాయక్, పోలీస్ గిరి, విరూపాక్షి, శమీపతి, సుహేల్‌బాషా, రామకృష్ణానాయక్, గంగాధర్, మోహ న్‌రెడ్డి, చైతన్యరాయల్, కవిత, రమణ, హరినాయక్, కుమార్ పాల్గొన్నారు.

పాఠశాలల ప్రారంభానికి ముందే కిట్లను చేర్చాలి



పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న అనూరాధ

రామకుప్పం, జూన్ 4 (ఆంధ్ర జ్యో): ప్రభుత్వం విద్యార్థుల కోసం మండల కేంద్రాలకు చేర్చిన అన్ని కిట్లను పాఠశాలలు పునః ప్రారంభమయ్యే లోపు ఆయా పాఠశాలకు చేర్చాలని డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర స్టూడెంట్ కిట్స్ రాష్ట్ర నోడల్ అధికారి అనూరాధ ఎంఈవోలను ఆదేశించారు. బుధవారం ఆమె రామకుప్పం ఎంఈవో కార్యాలయంలో పాఠ్య, నోటు పుస్తకాలు, బెల్టులు, ఇతర కిట్లను పరిశీలించారు. పాఠశాలలు పునః ప్రారంభమైన వారంలోపు పుస్త కాలు, ఇతర కిట్లను పంపిణీ చేయాలన్నారు. జూన్ 15 నుంచి విద్యార్థులకు సన్నబియ్యంతో నాణ్యమైన మధ్యాహ్న భోజనం విద్యార్థులకు అందించేలా చూడాల్సిన బాధ్యత మండల స్థాయి అధికారులతో పాటు ఉపాధ్యాయులదేనని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఎస్‌టీ సీఎంవో మధుసూదన్‌నాయుడు, పలువురు సీఆర్పీలు, ఎంఆర్‌సీ సిబ్బంది ఉన్నారు.

యోగాంధ్రను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు

బైరెడ్డిపల్లె, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని జయప్రదం చేయ డానికి అన్ని ప్రభుత్వశాఖల అధికారులు, సిబ్బంది సమష్టిగా కృషి చేయాలని జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు కోరారు. యోగాంధ్ర కార్యక్రమానికి సంబంధించి బుధవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో పలుశాఖల అధికారులు, పంచా యతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ గ్రామాల్లో యోగాపై అవగాహన కల్పించాలన్నారు. కార్య క్రమంలో ఎంపీడీవో రాజేంద్రబాలాజీ, తహసీల్దార్ ప్రసన్నకు మార్, వైద్యాధికారి విజయచందర్, ఎంఈవో వేణుగోపాల్‌రెడ్డి, ఈవోఆర్డీ ప్రసాద్, మండలపరిషత్ ఏవో ఆనంద్‌బాబు, ఐసీడీఎస్ సీడీపీవో అరుణశ్రీ, ఏపీవో హరినాథ్, ఏపీఎం లలిత, ఎంసీవో సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు మండల స్థాయి యోగా పోటీలు

రామకుప్పం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్ర మంలో భాగంగా గురు, శుక్రవారాల్లో రామకుప్పంలో మండల స్థాయి యోగా పోటీలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో మురళీధర్ రెడ్డి తెలిపారు. గురువారం 30 సంవత్సరాలు వయసు పైబడిన వారికి మండల పరిషత్ సమావేశ మందిరంలో, 19-35 సంవత్స రాల లోపు వారికి స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో , శుక్ర వారం 10-18 సంవత్సరాల లోపు వారికి బాలుర ఉన్నత పాఠశా లలో యోగాసనాలు, సూర్యనమస్కారాలు, ప్రాణాయామం, ధ్యానం విభాగాల్లో పోటీలు జరుగుతాయని ఆయన వివరించారు. ఆసక్తి ఉన్న వారు పోటీల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

క్షయ వ్యాధి నిర్మూలనే లక్ష్యం



అవగాహన ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది

చౌడేపల్లె, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): టీబీ నిర్మూలనే లక్ష్యంగా పని చేద్దామని డాక్టర్ పవన్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఆయన జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఆయన స్థానిక పీహెచ్‌సీ నుంచి బస్టాండు వరకు ర్యాలీ నిర్వహిం చారు. క్షయ వ్యాధికి స్థానిక పీహెచ్‌సీలో ఉచితంగా మందులు ఇవ్వనున్నట్లు తెలిపారు.

- పుంగనూరు రూరల్: క్షయవ్యాధిపై ఈనెల 9 నుంచి 100 రోజులపాటు గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు డాక్టర్ సుజనా తెలిపారు. బుధవారం మండలంలోని ముడిపాప నపల్లె పీహెచ్‌సీలో జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన దినత్సవం పోస్టర్లను ఆవిష్కరించారు.

నేటి నుంచి వేరుశనగ విత్తనాల పంపిణీ

పలమనేరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మండలంలో ఈనెల 5 నుంచి మండలంలోని ఆర్బీకేల వద్ద రాయితీ వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తున్నామని ఏవో సంధ్య తెలిపారు. వేరుశ నగ బస్తా రాయితీ పోను రూ.1674 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

- పుంగనూరు, సదుం, చౌడేపల్లె మండలాల్లో ఈనెల 5వ తేదీ నుంచి పుంగనూరు మండలంలో రాయితీ వేరుశనగ విత్త నాలు పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయాధికారులు తెలిపారు.

పల్లెదారులు గుంతలమయం..!




అడుగడుగునా గుంతలమయమైన పల్లెకుప్పం-రెక్కమాను రహదారి

రామకుప్పం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రామ కుప్పం మండలం పల్లెకుప్పం గ్రామం నుంచి వి.కోట మండలం వి.కోట-పేర్నాంబట్టు రోడ్డును కలిపే రెక్కమాను వరకు ఉన్న తారు రోడ్డు అ ధ్వానంగా మారిపోయింది. దీంతో జనం అవస్థ లకు గురవుతున్నారు. రామకుప్పం మండలం బందార్లపల్లె, గొరివిమాకులపల్లె, పంద్యాలమ డుగు, పీఎంకేతాండా పంచాయతీల పరిధిలోని ప్రజలతోపాటు వి.కోట మండలం ఎస్.బండప ల్లె పంచాయతీ ప్రజలు రోజూ పలు పనుల ని మిత్తం ఈ రహదారిలో రాకపోకలు సాగిస్తుం టారు. అలాగే తమిళనాడు రాష్ట్రం పేర్నాంబట్టు, గుడియాత్తం, ఆంబూరు, వేలూరు పట్టణాలకు ఇదే రహదారిలో ప్రయాణాలు చేస్తుంటారు. ర హదారి మొత్తం అడుగడుగునా ఛిద్రమై గుంత లమయంగా మారడంతో ఈ మార్గంలో ప్రయా ణించే వాహనదారులతోపాటు ప్రయాణీకులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రాష్ట్రంలో టీడీపీ నేతృత్వంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పలు గ్రామీణ రోడ్లను బాగు చేస్తున్నా రు. అలాగే పల్లెకుప్పం-రెక్కమాను రహదారిని సైతం బాగు చేయాలని రామకుప్పం, వి.కోట మండలాల్లోని సుమారు ఇరవై గ్రామాల ప్రజ లు కోరుతున్నారు.

అవసరమైన ప్రతి రైతుకూ వేరుశనగ విత్తనాలు



కుప్పం మున్సిపాలిటీలో...



రామకుప్పం మండలంలో...

కుప్పం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): అవసరమైన ప్రతి రైతుకూ రాయితీ వేరుశనగ విత్తన కాయలు ప్రభుత్వం పంపిణీ చేస్తుందని తెలుగు దేశం పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ అన్నారు. కుప్పం పురపాలక సంఘం 1, 2 వార్డులకు సంబంధించి సామగుట్టపల్లె సచివా లయంలో బుధవారం ఆయన వ్యవసాయాధికా రులతో కలిసి రాయితీ వేరుశనగ విత్తన కాయ లను పంపిణీ చేశారు. 1, 2 వార్డులకు సంబం ధించిన టీడీపీ నాయకులు యూనిట్ ఇన్‌చార్జి ముత్తు, బూత్ ఇన్‌చార్జి శ్రీరంగం, గోవింద స్వామి, నాగరాజు, నరసింహులు, ఎం.రోహిత్ కుమార్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

- రైతులు ఇబ్బంది పడకుండా నాణ్యమైన వేరుశనగ విత్తన కాయలు తగినన్ని ప్రభుత్వం సరఫరా చేస్తుందని, ప్రతి రైతుకూ అందిస్తుం దని కుప్పం మండల టీడీపీ అధ్యక్షుడు ప్రేమ్ కుమార్ తెలిపారు. కుప్పం మండలంలోని వెండుగంపల్లెలో బుధవారం ఆయన వ్యవసా యాధికారి ఫయాజ్ బాషాతో కలిసి వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేశారు. కార్యక్ర మంలో వ్యవసాయ అసిస్టెంట్ నాయక్, హార్టిక ల్చర్ అసిస్టెంట్ కార్తీక్, స్థానిక టీడీపీ నాయ కులు రమేశ్, రామచంద్ర, పార్థసారథి, అశోక్, లోకేశ్, వసనాడు సుబ్బు పాల్గొన్నారు.
- **పెద్దపంజాణి:** పెద్దపంజాణి మండలంలో బుధవారం వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ తనిఖీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు శివకుమార్, ఏవో రబీబా తదితరులు పాల్గొన్నారు.
- **రామకుప్పం:** రామకుప్పం మండలం పల్లెకుప్పంలో బుధవారం రాయితీ వేరుశనగ విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్ర మంలో ఏవో అమృత, టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వా హక కార్యదర్శి పట్ర నారాయణాచారి, పార్టీ మండలాధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ అధ్యక్షుడు ఆంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లెలో బుధవారం వ్యవసా యాధికారి ఆధ్వర్యంలో రైతులకు వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. పలమనేరు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు భువ నచంద్రగౌడు, నాయకులు ఉమాశంకర్, అరుణ్, సల్మాన్, తీర్థం గ్రామంలో గోవిందస్వామి, రమేష్, కృష్ణేగౌడు, విశ్వనాథ్ పాల్గొన్నారు.

- **వి.కోట:** రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని టీడీపీ మండల అధ్య క్షులు రంగనాథ్ అన్నారు. బుధవారం వి.కోట మంగలం బోడిగుట్టపల్లె, కుంభార్లపల్లె పంచా యతీల్లో వేరుశనగ విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రాంబాబు, మండల పార్టీ కార్యదర్శి ఈశ్వర్, మండల తెలుగు యువత అధ్యక్షులు ధీరజ్, కృష్ణప్ప, విశ్వనాథ్, ఏవో రాజ్యలక్ష్మీ, ఇతర వ్యవ సాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్‌తో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు



ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు అందజేస్తున్న నరేశ్ తదితరులు



చౌడేపల్లెలో ప్లకార్డులతో టీడీపీ, జనసేన నాయకులు



పుంగనూరులో మహిళలకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

కుప్పం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఎన్డీయే ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తూ మరోవైపు రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెట్టిస్తోందని జనసేన కుప్పం నియోజకవర్గ ఇన్‌చార్జి నరేశ్ అన్నారు. రాష్ట్రంలో టీడీపీ, జన సేన, బీజేపీ సంయుక్త కూటమి ఆధ్వర్యంలో పరిపాలన మొదలై ఏడాది పూర్తయిన సంద ర్భాన్ని పురస్కరించుకుని కుప్పంలోని ప్రసన్న తిరుపతి గంగమాంబ ఆలయం ఆవరణలో జన సేన ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను తలపిం చేలా సంబరాలు నిర్వహించారు. ఉదయం మహిళలకు ముగ్గుల పోటీలు పెట్టి బహుమ తులు అందజేశారు. ఈ సందర్భంగా నరేశ్ మాట్లాడుతూ వైసీపీ అధికారంలో ఉన్నపుడు ప్రజలు, రాష్ట్రం వెన్నుపోటుకు గురైందని విమ ర్శించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ల సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధివైపు శరవేగంగా పరుగులు పెడుతోందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని జనసేన నాయకులు, కార్య కర్తలు, మహిళలు పాల్గొన్నారు.

- **పుంగనూరు రూరల్:** వెన్నుపోటు పొడ వడం వైసీపీకే చెల్లుతుందని టీడీపీ మండలా ధ్యక్షులు విరూపాక్షి, మాధవరెడ్డి ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలం పూర్తి కావడంతో జనసేన పార్టీ నాయకుడు వేణుగో పాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం మండలం లోని చదళ్ల, పూజగానిపల్లె, నెక్కుంది, దోబీ కాలనీ తదితర ప్రాంతాల్లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. జనసేన నాయకులు శివకుమార్ రెడ్డి, నరేంద్రరెడ్డి, నారాయణరెడ్డి, చైతన్యరా యల్, నరేశ్‌రాయల్, పాములహరి, హరినా యక్, బాలాజీ నాయక్, చిన్నా పాల్గొన్నారు.
- బుధవారం రాత్రి పుంగనూరులో కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసి ఏడాది పూర్తి కావడంతో సంబరాలు జరుపుకున్నారు. కూటమి నాయకులు సీవీరెడ్డి, పోలీస్ గిరి, విరూపాక్షి, సుబ్రహ్మణ్యంరాజు, శమీపతి, ఇబ్రహీం, కోలాట వెంకటరమణ, చంద్ర, షామీర్, చైతన్యరాయల్, పాముల హరి, నరేశ్ రాయల్ పాల్గొన్నారు.
- **చౌడేపల్లె:** నవ్యాంధ్రకు వైసీపీ పీడ విర గడై ఏడాది అవుతుందని టీడీపీ నాయకులు పగడాల హరిప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం రాత్రి స్థానిక బస్టాండులో టీడీపీ నాయకులు, జనసేన నాయకులు సంబరాలు జరుపుకు న్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కార్తీక్, జనసేన నాయకులు చరణ్, రాజీ, నాగరాజు, మురళీ, నరేష్ పాల్గొన్నారు.

చట్టాన్ని ధిక్కరించి వైసీపీ ర్యాలీ



పలమనేరు ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న వైసీపీ నాయకులు



సీఐ శంకరయ్యతో వాగ్వాదం చేస్తున్న ఎమ్మెల్సీ భరత్

కుప్పం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కుప్పం పట్ట ణంలో 30 యాక్ట్ అమల్లో ఉన్నా సరే చట్టాన్ని ధిక్క రించి వైసీపీ ర్యాలీ నిర్వహించింది. పార్టీ అధిష్ఠానం ఇచ్చిన పిలుపు మేరకు వెన్నుపోటు దినం అంటూ ఎమ్మెల్సీ భరత్ ఇంటి నుంచి వైసీపీ కార్యకర్తలు, నాయకులు ర్యాలీగా బయలుదేరారు. మొదట్లోనే అడ్డుకున్న డీఎస్పీ పార్థసారథి వారిని నిలువరించ డానికి ప్రయత్నించారు. అయితే కొద్దిమంది మాత్రమే వెళ్లి రెవెన్యూ అధికారులకు వినతిపత్రం ఇస్తామని చెప్పగా అనుమతి ఇచ్చారు. అయితే అప్పటికే గుమికూడిన ఆ పార్టీ కార్యకర్తలను గుంపుగా తీసుకుని ఎమ్మెల్సీ భరత్ కడా కార్యా లయం వరకు ర్యాలీగా వెళ్లారు. కార్యాలయంలోకి అంద రూ వెళ్లడానికి ప్రయత్నించడా న్ని నిలువరిం చిన కుప్పం అర్బన్ సీఐ శంకరయ్యతో వాగ్వాదానికి దిగారు. అనంతరం ఎమ్మెల్సీతో తహశీల్దారు కార్యాల యంలోకి వెళ్లి వినతిపత్రం సమర్పించారు.

35 మందిపై కేసు నమోదు

ర్యాలీ పేరుతో నిబంధనలు ఉల్లంఘించినందుకు ఎమ్మెల్సీ భరత్‌తో సహా 35 మంది వైసీపీ నాయ కులు,కార్యకర్తలపై కేసులు నమోదు చేసినట్లు అర్బ న్ సీఐ శంకరయ్య తెలిపారు. పరిమిత సంఖ్యలో, పరిమిత దూరం నుం చి రావడానికి అనుమంతిం చామని.. అయితే ఆ నిబంధనలు అతిక్రమించడమే కాకుండా అడ్డుకున్న పోలీసులపై దురుసుగా ప్రవ ర్తించారని పేర్కొన్నారు.

- **పలమనేరు:** పలమనేరులో మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ, జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కృష్ణమూర్తి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.
- **పుంగనూరు:** కూటమి ప్రభుత్వ ఏడాది పాల నలో దౌర్జన్యాలు, అరాచకాలే తప్ప అభివృద్ధి శూన్య మని రాష్ట్ర మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి ఆరోపించారు. వెన్నుపోటు దినం కార్య క్రమంలో భాగంగా బుధవారం స్థానికంగా వైఎస్ ఆర్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళలర్పించి ర్యాలీ నిర్వహించారు. సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ రాముకు అందజేశారు. చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప, ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీంబాషా, వెంకటరెడ్డియాదవ్, అనీషారెడ్డి, పెద్దిరెడ్డి, నాగభూషణం, పోకల అశోక్‌కు మార్, ఆవుల అమరనాథ్ పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో హామీల అమలుకు కృషి



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

కల్లూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రజలకిచ్చిన ఎన్ని కల హామీల అమలుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని టీడీపీ నాయకులు ధనంజయనాయుడు, అనిల్‌కుమార్, అన్సర్‌బాషా తెలిపారు. కూట మి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా టీడీ పీ ఆధ్వర్యంలో పులిచెర్ల మండలం కల్లూరు ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. నాయకులు పురుషోత్తంచౌదరి, రాజేష్, అలీం, అల్తాఫ్, మునిరత్నం, సర్దార్, ఖాసిం, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

చారిటబుల్ ట్రస్టు సేవలు అభినందనీయం



అయూబ్‌ఖాన్‌ను అభినందిస్తున్న సీఐ సుబ్బరాయుడు

పుంగనూరు, జూన్ 4 (ఆంధ్ర జ్యోతి): పేద ప్రజలకు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం హెల్త్ ఎడ్యుకేషన్ చారిటబుల్ ట్రస్టు ద్వారా సేవలు అందజేయడం అభినందనీ యమని సీఐ సుబ్బరాయుడు పేర్కొన్నారు. బుధ వారం పట్టణంలో అడాప్టస్ కోచింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ పేద విద్యార్థులకు ఉచితంగా కోచింగ్ ఇవ్వడం అభినందనీయమన్నారు. ఎస్ఐ లోకేశ్, ట్రస్ట్ సభ్యులు నాగరాజ, త్రిమూర్తిరెడ్డి, ఇంతియా జ్‌అహ్మద్, నరసింహులు పాల్గొన్నారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం



చౌడేపల్లె, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): యోగా తోనే సంపూర్ణ ఆరో గ్యంగా ఉంటామని స్థానిక జూనియర్ కళా శాల ప్రిన్సిపాల్ జయ ప్రకాష్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక జూనియర్ కళాశాలలో యోగాపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ యోగా, ధ్యానం చేయడంతో ఆరోగ్యంగా ఉంటామన్నారు. విద్యార్థులచే యోగాసనాలు చేయించారు. కార్యక్రమంలో అధ్యాపకులు బాలాజీ, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం

కుప్పం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్స వాన్ని గురువారం ఘనంగా నిర్వహించనున్నట్లు కుప్పం అటవీ క్షేత్రాధికారి జయశంకర్ తెలిపారు. అటవీ దినోత్సవాన్ని పురస్కరిం చుకుని కంగుంది బీట్, కంగుంది రిజర్వ్ ఫారెస్టులో దొరచెరువు ప్రదేశంలో ప్రతిపాదిత మంకీ క్యాంపు ప్రాంతంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతామన్నారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమాన్ని కుప్పం నియోజకవర్గ ప్రజలు, ప్రముఖులు అందరూ హాజరు కావాలని ఆయన కోరారు. అలాగే పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఉదయం 10 గంట లకు కుప్పం పురపాలక సంఘం పరిధిలోని దళవాయికొత్తపల్లె కూడలినుంచి మోడల్ కాలనీ వరకు రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు తెలిపారు.

వైభవంగా గంగజాతర వేడుకలు



పొంగళ్లతో మహిళలు


సోమల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం సూరయ్యగారిపల్లెలో బుధవారం గంగజాతర వేడుకలు ఘనంగా జరిగాయి. అలాగే నంజంపేట, పొదలలకుంటపల్లెల్లో నడివీధి గంగ మ్మ ఆలయం వద్దకు మహి ళలు ప్రదర్శనగా బోణాలు తీసుకెళ్లారు. కార్య క్రమాల్లో టీడీపీ, జనసేన మండల పార్టీ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం నాయుడు, నాగభూ షణం రాయల్, సోమల ఏఎంసీ చైర్మన్ శ్రీని వాసులు నాయుడు, మాజీ సర్పంచ్ హరిప్ర సాద్, బాబురావు, రమేశ్ నాయుడు, సూరిశెట్టి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పాతపేటలో..



గంగజాతరకు హాజరైన ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

బైరెడ్డిపల్లె, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని పాతపేట గ్రామంలో బుధవారం బాటగంగమ్మ జాతర ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయంలో విశేష పూజలు నిర్వహించి మేళతాళాలు, డప్పువా యిద్యాల మధ్య గెరిగెలను ఊరేగించారు. పల మనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు.



బంగారు తిరుత్తణి కొండపై గోపుర ఆవిష్కరణ



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి

సోమల, జూన్ 4 (ఆంధ్ర జ్యోతి): సోమల-సదుం మార్గం లోని బంగారు తిరుత్తణి కొండపై కొలువుదీరిన వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఆలయ గోపుర ఆవిష్కరణ, కలశస్థాపన, నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయంలోని మూలవిరాట్‌లకు అభిషేక పూజలు చేశారు. కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్త మేల్నాటి పద్మావతమ్మ రఘుపతి, దాతలు రెడ్డిజనార్దన్, విశ్వనాథం నాయుడు, మురళీకృష్ణ తదిత రులు పాల్గొన్నారు.



డీసీసీబీలోని ఎన్టీఆర్ విగ్రహానికి బుధవారం పూలమాల వేసి, నివాళి అర్పించిన పర్సన్ ఇన్‌చార్జి అమాస రాజశేఖరరెడ్డి, చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, మాజీ ఎమ్మెల్యే సీకేబాబు, ఏపీ గ్రీనరీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ సుగుణమ్మ, బీజేపీ నాయకుడు నవీన్‌కుమార్‌రెడ్డి తదితరులు

ప్రతి రైతు వేరుశనగ పంటను పండించాలి

గుడిపాల, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు వేరుశనగ పంటను సాగు చేసి తద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు అన్నారు. బుధవారం మండలంలోని బసవాపల్లె పంచాయతీ నీకే.పల్లె ఆర్ఎస్కేలో రైతులకు వేరుశనగ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చెన్నకేశవులునాయుడు, బాలాజీనాయుడు, సర్పంచ్ సునీల, మధుసూదన్‌నాయుడు, సుమతి, ఉదయ, ఏవో మాధవి, యోగప్రియ తదితరులు పాల్గొన్నారు.

యోగా శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలి

వెదురుకుప్పం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయిలో గురువారం నుంచి యోగా శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలని భూ రికార్డుల సహాయ సంచాలకులు జయరాజు తెలిపారు. బుధవారం వెదురుకుప్పం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో పురుషోత్తం, తహసీల్దార్ బాబు బృందంతో కలసి యోగాంధ్ర కార్యక్రమంపై సమీక్షించారు.

అశ్వవాహనంపై వరదుడి దివ్యదర్శనం





అశ్వవాహనంపై ఇంద్రవరదుడు, వెన్నత్తాయ్ కన్నన్ తిరుక్కోళంలో చిన్నికృష్ణుడు

యాదమరి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన యాదమరి త్రివేణి సంగమంలో వెలసిన వరదరాజస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం ఉదయం నిత్యకైంకర్యాలు, అభిషేకం, అలంకారాల అనంతరం శ్రీకృష్ణుడి అవతారంలో వెన్నత్తాయ్ కన్నన్ తిరుక్కోళంలో స్వామివారు పురవీధుల్లో భక్తులను అనుగ్రహించారు. గ్రామస్తులు స్వామివారికి ఫల, పుష్పాలు, మంగళహారతులు సమర్పించారు. రాత్రి వరదుడు అశ్వ వాహనంపై రాజమన్నార్ రూపంలో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. గురువారం సాయంత్రం 3 గంటలకు తీర్థవారి, రాత్రి పుణ్యకోటి విమానం నిర్వహించిన అనంతరం ధ్వజాఅవరోహణ కార్యక్రమం జరుగనుంది.

వైభవంగా పరదరామి గంగజాతర

యాదమరి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): యాదమరి మండల సరిహద్దులోని పరదరామిలో గంగమ్మ జాతర వేడుకగా జరిగింది. ఆంధ్ర - తమిళనాడు సరిహద్దులోని పరదరామిలో మంగళవారం రాత్రి ముత్యాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, గెరిగను గ్రామంలో ఊరేగించారు. బుధవారం ఉదయం ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తులకు అమ్మవారి విశ్వరూప దర్శనం కల్పించారు. రాత్రి గంగమ్మ నిమజ్జనంతో జాతర ముగిసింది.



గంగమ్మ విశ్వరూపం

వైసీపీ రాక్షస పాలనతో విసిగిపోయి

కూటమి ప్రభుత్వానికి పట్టం



చిత్తూరు గాంధీ విగ్రహం వద్ద వేసిన ముగ్గులు

చిత్తూరు సిటీ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ రాక్షస పాలనతో విసిగిపోయిన ప్రజలు రాజకీయ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాదైన సందర్భంగా స్థానిక గాంధీ విగ్రహం వద్ద బుధవారం టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. తెలుగుదనం ఉట్టిపడేలా గాంధీ విగ్రహం ఎదుట ముగ్గులు వేసి, మామిడి తోరణాలు కట్టి, చెరకుగడలు కట్టి, టపాకాయలు పేల్చి పండుగ వాతావరణాన్ని తలపించేలా సంబరాలు జరుపుకున్నారు. రాత్రి 7.30 గంటలకు కూటమి నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఎమ్మెల్యే కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాక్షస పాలన నుంచి రాష్ట్ర ప్రజలకు విముక్తి కలిగిన రోజు 2024 జూన్ 4 అని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలి ఏడాదిలోనే 70 శాతం హామీలు అమలు చేశామని అన్నారు. చిత్తూరు నియోజకవర్గంలో హైరోడ్డు విస్తరణ, తాగునీటి ఏర్పాటు, రోడ్ల మరమ్మతులు, కొత్త రోడ్ల నిర్మాణం, చెరువుల సుందరీకరణ పనులు జరుగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, పార్టీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, మేయర్ అముద, నేతలు చంద్రప్రకాష్, కాజూరు బాలాజి, వసంత్ కుమార్, బీజేపీ నేతలు చిట్టిబాబు, రామభద్ర, రెడ్డి మస్తాన్, జనసేన నేతలు కవిత, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

● ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్

● బంగారుపాళ్యం (ఆంధ్రజ్యోతి): రాక్షస పాలన నుంచి రాష్ట్ర ప్రజలకు జూన్ 4వ తేదీ విముక్తి పొందిన రోజని ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. బుధవారం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఎస్సీ ధరణీప్రసాద్, గౌరవ అధ్యక్షుడు ఎస్సీ జయప్రకాష్ ఆధ్వర్యంలో టీడీపీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. మండల పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను ఎమ్మెల్యే మురళీమోహన్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. అనంతరం భారీ ఎత్తున బాణసంచా పేలుస్తూ జాతీయ రహదారి గుండా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎమ్మెల్యేతోపాటు టీడీపీ నాయకులు కూడా జెండా పట్టుకుని చిందులేశారు. ప్రభుత్వ కళాశాల వద్దగల అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో యాదమరి, తవణంపల్లె, పూతలపట్టు, ఐరాల మండలాల అధ్యక్షులు, నాయకులతో పాటు జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● గంగాధరనెల్లూరు (ఆంధ్రజ్యోతి): సైకోపాలన నుంచి విముక్తి లభించడంతో ప్రతి ఒక్కరూ సంతోషకరమైన జీవితం గడుపుతున్నారని టీడీపీ పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రగుంట్ల కృష్ణమ నాయుడు అన్నారు. పలువురు నేతలతో కలిసి బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, అనంతరం బస్టాప్ కూడలిలో కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో నేతలు శ్రీధర్‌యాదవ్, స్వామిదాస్, దేవసుందరం, చెంగల్రాయ యాదవ్, జయశంకర్ నాయుడు, రుద్రయ్య నాయుడు, లోకనాధరెడ్డి, ఇందిరమ్మ, కామసాని కోదండరెడ్డి, మోహన్ నాయుడు, పోలు రుషేంద్ర రెడ్డి, మోహన్‌మురళి, నెల్లేపల్లె సుబ్రమణ్యం, జమీర్, మునస్వామి, రాజేంద్రన్, బీజేపీ నేతలు ఇడగట్టి సుధాకర్, మురళి తదితరులు పాల్గొన్నారు.

● నగరి (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలం పూర్తయిన సందర్భంగా నగరి గ్రామ ఆదిదేవత సామాలమ్మకు ఒకటో వార్డు టీడీపీ నాయకులు చలపతి, లత ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పేరిట అర్చనలు చేశారు.



బంగారుపాళ్యంలో ర్యాలీగా వెళుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్ తదితరులు



గంగాధరనెల్లూరులో కేక్ కట్ చేస్తున్న ఎర్రగుంట్ల కృష్ణమ నాయుడు

● ఐరాల (ఆంధ్రజ్యోతి): ఐరాల బస్టాండ్ సర్కిల్‌లో కూటమి కార్యకర్తలు టపాకాయలు పేల్చి, స్వీట్లు పంచారు. మండల టీడీపీ అధ్యక్షుడు హరిబాబునాయుడు, గిరిధర్‌బాబు మాట్లాడుతూ ప్రజల కష్టాలు తీర్చడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ లత, లోకేష్, రాజేష్‌రెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● వెదురుకుప్పం (ఆంధ్రజ్యోతి): ఏపీలో ప్రజా తీర్పుతో ఏడాది అయిందని తెలుగుదేశం పార్టీ సంబరాలు చేసుకుంది. వెదురుకుప్పం మండలం పాతగుంటలో బాణసంచా పేల్చారు. తెలుగు యువత జిల్లా వైస్ ప్రెసిడెంట్ చంద్రబాబురెడ్డి, లోకనాథరెడ్డి, తిమ్మరాజులు, తిరుపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ● కార్వేటినగరం మండలం ఆర్కేవీబీపేట వద్ద తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ మండల ప్రధానకార్యదర్శి చంద్రగిరి చెంగల్రాయులు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు.







నగరిలో సామాలమ్మకు పూజలు చేస్తున్న టీడీపీ నాయకులు - ఐరాలలో, వెదురుకుప్పం మండలం పాతగుంటలో సంబరాలు చేసుకుంటున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

వరసిద్ధుడి సేవలో టీటీడీ సీవీఎస్వో

ఐరాల(కాణిపాకం), జూన్ 4 (ఆంధ్రజ్యోతి): టీటీడీ సీవీఎస్వో మురళీకృష్ణ బుధవారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఆయన్ను ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఏఈవో రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా వరసిద్ధుడి ఆలయానికి చిత్తూరు మండలం వెంగనపల్లెకు చెందిన రామకృష్ణ నాయుడు బుధవారం రూ.3,00348 చెక్కు రూపంలో విరాళంగా అందించారు. ఇందులో అన్నదానానికి రూ.2,00,232, గోసంరక్షణ ట్రస్టుకు రూ.1,00116ను వినియోగించాలని దాత అధికారులను కోరారు.

కలెక్టర్‌ను కల్సిన నగరి ఎమ్మెల్యే

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ బుధవారం కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిశారు. కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో ఎమ్మెల్యే కలిసి నగరి నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.

టైరు పేలడంతో ఆగిన ఆర్టీసీ బస్సు

● త్రుటిలో తప్పిన ప్రమాదం

పూతలపట్టు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులతో తిరుపతి వైపు వెళ్తున్న ఓ ఆర్టీసీ బస్సు టైరు పగిలిపోవడంతో ఘోరప్రమాదం త్రుటిలో తప్పింది. చిత్తూరు-2 డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సుమారు 30 మంది ప్రయాణికులతో తిరుపతి వెళ్తుండగా, పూతలపట్టు అంబేడ్కర్ సర్కిల్ వద్దకు రాగానే ఉన్నట్లుండి బస్సు ముందుభాగం కుడివైపు ఉన్న టైరు పగిలిపోయింది. దీంతో బస్సు అదుపు తప్పింది. ప్రయాణికులు భయాందోళనకు గురై కేకలు పెట్టగా, డ్రైవర్ చాకచక్యంగా బస్సును ఓ పక్కగా ఆపివేశాడు. టైరు పగిలిన సమయంలో రోడ్డుపై ఎవరూ లేకపోవడంతో అటు ప్రయాణికులు, ఇటు దుకాణదారులు ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవర్ అప్రమత్తంగా లేకుంటే బస్సు రోడ్డు పక్కనవున్న దుకాణాలు, హోటళ్లలోకి దూసుకెళ్ళేది. అనంతరం ప్రయాణికులను వేరే బస్సులో తిరుపతికి తరలించారు. సమాచారం అందుకున్న పూతలపట్టు సీఐ కృష్ణమోహన్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

● లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు: ఇద్దరికి గాయాలు

ముందు వెళ్తున్న లారీని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఇద్దరు ప్రయాణికులు స్వలంగా గాయపడ్డారు. చిత్తూరు నుంచి లారీ పీలేరు వెళుతుండగా మొరవపాటూరు బస్టాప్ సమీపంలో ఆవు రోడ్డుకు అడ్డంగా రావడంతో డ్రైవర్ బ్రేక్ వేశాడు. వెనుకనే వస్తున్న పీలేరు ఆర్టీసీ బస్సు లారీని ఢీకొనడంతో బస్సులో ప్రయాణిస్తున్న ఇద్దరు ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. సీఐ కృష్ణమోహన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యర్థాలు తరలించిన ట్రాక్టర్ సీజ్

చిత్తూరు అర్బన్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): భవన వ్యర్థాలను ఇరువారం రోడ్డుపక్కన పడేసిన వారికి బుధవారం నగరపాలక అధికారులు జరిమానా విధించారు. భవన నిర్మాణ, ఇతర వ్యర్థాలను నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ట్రాక్టర్లలో తీసుకొచ్చి ఇరువారం రోడ్డు పక్కనే పడేశారు. వీటిని గుర్తించిన నగరపాలక అధికారులు ఆ ట్రాక్టర్‌ను పట్టుకుని జరిమానా విధించి సీజ్ చేశారు. రోడ్డు పక్కన వ్యర్థాలను పడేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

సీఎంసీ వద్ద డివైడర్‌ను ఢీకొని కారు బోల్తా

గుడిపాల, జూన్ 4(ఆంధ్రజ్యోతి): వేలూరు నుంచి చిత్తూరు వస్తున్న కారు 190రామాపురం సీఎంసీ వద్ద లారీని ఓవర్‌టేక్ చేయబోయి ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొన్న సంఘటన బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వేలూరు నుంచి చిత్తూరు వైపు వస్తున్న కారు బ్రిడ్జి వద్ద లారీని ఓవర్ టేక్ చేయడానికి ప్రయత్నించగా అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. అందులో ప్రయాణిస్తున్న చిత్తూరుకు చెందిన సయ్యద్, ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన మహిళను సీఎంసీలో చేర్పించారు.

వ్యాధుల నియంత్రణకు సమన్వయంతో పని చేయాలి

చిత్తూరు అర్బన్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): సీజనల్, క్రిమి కీటకాల వల్ల వ్యాప్తి చెందే వ్యాధుల నియంత్రణకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్ చెప్పారు. మలేరియా మాసోత్సవాలలో భాగంగా బుధవారం వ్యాధుల నియంత్రణపై ఇంజనీరింగ్, ప్రజారోగ్యం విభాగం అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ నెలలో చేపట్టాల్సిన కార్యక్రమాల యాక్షన్ ప్లాన్‌పై జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ చర్చించారు. అనంతరం మలేరియా మాసోత్సవ గోడపత్రికలను ఆవిష్కరించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి రామకృష్ణ, డీఈ శ్రావణి, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేరుశనగ విత్తనాల కొరత లేకుండా చూడండి

ఐరాల/పూతలపట్టు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు నియోజకవర్గంలో రైతులకు వేరుశనగ విత్తనాల కొరత లేకుండా చూడాలంటూ వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడితో బుధవారం స్థానిక ఎమ్మెల్యే మురళీమోహన్ ఫోన్‌ద్వారా కోరారు. వేరుశనగ విత్తనాల కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వారికి సరిపడా విత్తనాలు అందించాలని కోరగా, స్పందించిన మంత్రి రెండు రోజులలో రైతులకు సరిపడేలా విత్తనాలు పంపిణీ చేస్తామని హామీయిచ్చారు.

టీడీపీ, వైసీపీ కార్యక్రమాలతో పోలీసులకు టెన్షన్

గంగాధరనెల్లూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరులో బుధవారం ఉదయం టీడీపీ, వైసీపీ ఆధ్వర్యంలో కార్యక్రమాలను ఏర్పాటు చేయడంతో పోలీస్ యంత్రాంగం టెన్షన్ పడింది. ఈ కార్యక్రమాల నిర్వహణకు ముందస్తుగా జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు ఏఆర్ డీఎస్పీ మహబూబ్‌బాషా, గంగాధరనెల్లూరు ఇన్‌చార్జి సీఐ శ్రీనివాసంతి, సీఐ జయరామయ్య, 25మంది పోలీస్ సిబ్బందితో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ఎటువంటి సమస్యలు లేకుండా రెండు పార్టీల కార్యక్రమాలు పూర్తి కావడంతో పోలీసు యంత్రాంగం ఊపిరిపీల్చుకుంది.

వివేకా గొడ్డలి పోటుకు కారకులెవరు: టీడీపీ



ఫ్లెక్సీని ఏర్పాటు చేసిన టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి మోహన్‌మురళి

వెదురుకుప్పం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): వైఎస్ వివేకానందరెడ్డి గొడ్డలి పోటుకు కారకులెవరు జగన్ అంటూ తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జి పి.మోహన్‌మురళి ప్రశ్నించారు. బుధవారం వెదురుకుప్పంలో 'వైఎస్ వివేకానందరెడ్డి గొడ్డలి పోటుకు కారకులెవరు జగన్' అంటూ ఫ్లెక్సీని టీడీపీ నాయకులు ఏర్పాటుచేశారు. మోహన్‌మురళి మాట్లాడుతూ వైఎస్ వివేకానందరెడ్డి గొడ్డలిపోటుకు కారకులు ఎవరన్న విషయాన్ని జగన్ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నీటి సంఘ అధ్యక్షుడు దామోదరరెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు వరప్రసాద్, నాయకులు హేమశేఖర్‌రెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

ఆ ఫ్లెక్సీ ఏర్పాటు అభ్యంతరకరం: వైసీపీ

వెదురుకుప్పం మండల కేంద్రంలో వైఎస్ వివేకానందరెడ్డి గొడ్డలిపోటుకు కారకులెవరు జగన్ అంటూ ఫ్లెక్సీ ఏర్పాటు చేయడం అభ్యంతరకరమని గంగాధరనెల్లూరు నియోజకవర్గ వైసీపీ వైద్య విభాగ అధ్యక్షుడు డాక్టర్ కోలారు వెంకటప్రకాష్ తెలిపారు. బుధవారం వెదురుకుప్పంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ మేనిఫెస్టోను అమలుచేయకుండా ఇలాంటి ఫ్లెక్సీలు పెట్టడం సిగ్గుచేటన్నారు. మంచి పోస్టర్లు, ఫ్లెక్సీలు వేస్తే తాము స్వాగతిస్తామన్నారు.

అర్జీలను త్వరితగతిన పరిష్కరించండి

చిత్తూరు రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని చిత్తూరు ఆపరేషన్ డివిజన్ ఈఈ మునిచంద్ర కోరారు. బుధవారం స్థానిక గాంధీ రోడ్డులోని చిత్తూరు ఆపరేషన్ డివిజన్ విద్యుత్ కార్యాలయంలో ఆ శాఖ గ్రీవెన్స్ డే నిర్వహించారు. గ్రీవెన్స్‌లో వచ్చిన 4 అర్జీలను త్వరగా విచారణ చేసి పరిష్కరించాలని తెలిపారు. డీఈ ఆనంద్ అర్జీలను స్వీకరించారు.

అంకాళ పరమేశ్వరి ఆలయ కుంభాభిషేకం

విజయపురం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీహరిపురంలో అంకాళ పరమేశ్వరి అమ్మవారి నూతన ఆలయ విగ్రహ ప్రతిష్ఠ అష్టబంధన మహాకుంభాభిషేకం బుధవారం ప్రారంభమైంది. కేఆర్ పాళెం పుండరీక వరదానందస్వామి వారి పర్యవేక్షణలో కీళపూడి శాస్త్ర పండితులు రాజేంద్రాచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి: వైసీపీ

చిత్తూరు అర్బన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదంటూ వెన్నుపోటు దినం పేరుతో బుధవారం వైసీపీ నాయకులు.. ర్యాలీలు నిర్వహించి, అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. చిత్తూరులో వైసీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, వైసీపీ నేతలు పాల్గొన్నారు.

నగరి: మాజీ మంత్రి రోజా ఆధ్వర్యంలో నగరిలో ర్యాలీ జరిగింది. నగరి, పుత్తూరు మున్సిపల్ చైర్మన్లు నీలమేఘం, హరి, నేతలు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: మాజీ ఎమ్మెల్యేలు సునీల్ కుమార్, లలితకుమారి, మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. జడ్పీ ఉపాధ్యక్షుడు ధనంజయరెడ్డి, మాజీ చైర్మన్ ఎంటీ కుమార్ రాజా, జడ్పీటీసీ సోమశేఖర్, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. నియోజకవర్గ ఇన్‌చార్జి కృపాలక్ష్మి, మండల కన్వీనర్ వెంకటరెడ్డి, నేతలు పాల్గొన్నారు.



గంగాధరనెల్లూరులో ఆర్ఐకి వినతిపత్రం అందజేస్తున్న నారాయణస్వామి తదితరులు



బంగారుపాళ్యం తహసీల్దార్‌కు వినతిప్రతాన్ని అందజేస్తున్న సునీల్ కుమార్, లలితకుమారి



చిత్తూరులో ర్యాలీగా వస్తున్న వైసీపీ శ్రేణులు



నగరిలో ర్యాలీలో పాల్గొన్న రోజా నాయకులు